## నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

విడిచిపెట్టబోకు విశ్వాసపాత్రులన్
తోడునున్నవారి వీడబోకు
కలిమి వచ్చిపోవు కలకాలముండదు
శరణుకోరువారి శ్రద్ధ చూపు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.



సంచిక 30 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | జూలై 29, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## ప్రశ్నపత్రాల లీకేజీలకు కారకులను
# కఠినంగా శిక్షించాలి

- అప్పట్లో గ్లోబరీనాపై చర్యలు తీసుకోకపోవడంతో సమస్య
- గ్లోబరీనా అక్రమాలు సీబీఎస్ఈకీ విస్తరించాయి
- కేసీఆర్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు
- ఇకనుంచి సకాలంలో ఫీజుల చెల్లింపునకు చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి



**న్యూఢిల్లీ,జూలై 28 ):** ప్రశ్నపత్రాల లీకేజీలకు కారణమైన వాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి .రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవని, ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతు న్నాయని సీఎం విమర్శించారు. ఈ విషయంలోజాతీయస్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరమున్నదని సీఎం అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్రం మానుకోవాలని సీఎం సూచించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందని, ఈ అంశంపై పార్లమెంట్ చర్చ జరగాల్సి ఉందన్నారు. సభలో చర్చ జరిగితే రాహుల్ గాంధీ అన్ని అంశాలపై మాట్లాడతారని సీఎం తెలిపారు. ప్రశ్నా పత్రాలలీకేజీల నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాన్ని

మిగతా2లో...





## హామీల అమలులో కమిటీలదే కీలక పాత్ర

- హామీలు అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత వారితే
- హామీల అమలు కమిటీల సమావేశంలో స్పీకర్ ప్రసాద్ కుమార్

## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్లతో సి.ఎస్ టెలీ కాన్ఫరెన్స్



## నిరసనకారులపై
# చర్యలు వద్దు

- మైనర్లు, నేరచరిత లేని వారిని వదిలేయండి
- విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశం

**న్యూఢిల్లీ,జూలై 28 :** పరీక్ష పేపర్ లీకేజీలపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో అరెస్టయిన విద్యార్థుల విషయంలో సుప్రీంకోర్టు మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. 18 ఏళ్లలోపు మైనర్లు, అలాగే ఎలాంటి నేరచరిత్ర లేని విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి, వారిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని అత్యున్నత న్యాయస్థానం తన తాత్కాలిక ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది నీట్ పరీక్ష పేపర్ లీక్ అంశంపై దేశవ్యాప్తంగా సాగిన నిరసనల సమయంలో, విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, దౌర్జన్యాలపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఘటనలకు మిగతా2లో...



## రైతుకు సాంకేతికత చేరవేయడమే లక్ష్యం

- వందఎపిసోడ్లు పూర్తి చేసుకున్న రైతునేస్తం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**హైదరాబాద్,జూలై 28 :** రైతు చెంతకు నూతన సాంకేతికతే 'రైతునేస్తం' లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

మిగతా2లో...

# పరీక్షల సంస్కరణల బిల్లుకు మద్దతు ఇస్తాం

- గతంలో జరిగిన తప్పులపై వివరణ ఇవ్వాల్సిందే
- మహిళా బిల్లుతో డీలిమిటేషన్ చేర్చి గందరగోళం చేస్తున్నారు
- అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తాం
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

**న్యూఢిల్లీ,జూలై 28 :** మంచి ఉద్దేశంతో పరీక్షల సంస్కరణల బిల్లు తీసుకొస్తే బీఆర్ఎస్ మద్దతు ఇచ్చి స్వాగతి స్తుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొత్త బిల్లులు తీసుకు రావడానికి ముందు గత తప్పుల నుంచి ఏమి నేర్చుకుందో ప్రజలకు చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ఐదుసార్లు పేపర్ లీకేలు జరిగాయని.. అందులో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా మూడుసార్లు జరిగాయని

మిగతా2లో...



# లీక్ నిందితుల్ని శిక్షించాలి

● కోచింగ్ సెంటర్లపై దేశవ్యాప్త విధానం ఉండాలి ● యూనివర్సిటీలపై కేంద్రం ఆధిపత్యం వద్దు ● 'విద్య' రాష్ట్రాల పరిధిలోనే ఉండాలి ● కేంద్రం దాన్ని గుంజుకునే ప్రయత్నాలు మానాలి ● అధికారుల నియామకం రాష్ట్ర ప్రభుత్వ విచక్షణాధికారం ● ఢిల్లీలో మీడియాతో సీఎం ఏ రేవంత్ రెడ్డి ● 11.56 లక్షల ఇండ్లు ఇవ్వండి ● వీబీ గ్రామ్‌జీలో పది కొత్త పనులు చేర్చండి : కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో భేటీలో సీఎం విజ్ఞప్తి



**హైదరాబాద్,జూలై 28 :** ప్రశ్న పత్రాల లీకేజీలకు కారణమైనవాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్య లు లేవని, ఆఫ్‌లైన్ లోనే సమస్యలు వస్తున్నాయని అభిప్రాయ పడ్డారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం అక్కడే ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా యని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతున్నాయని చెప్పారు. దీనిపై జాతీయ స్థాయిలో ఒక విధానాన్ని

మిగతా2లో...

## భవిష్యత్‌లో పేపర్ లీకులకు
# అడ్డుకట్ట


యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్

లీకులకు పాల్పడితే పదేళ్ల జైలు..పది కోట్ల జరిమానా

గతంలో లీకులు జరిగినా చర్యలు తీసుకోని ప్రభుత్వాలు

లోక్‌సభలో బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్



## భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో
# రీ-సర్వే కీలక ఘట్టం

- ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ గ్రామసభలు నిర్వహించాలి
- రీసర్వేకు కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- నిర్ధేశిరచిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం

**హైదరాబాద్,జూలై 28 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ మిగతా2లో...

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



# ప్రశ్నపత్రాల లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి

(మొదటి పేజీ తరువాయి)

చూసి తర్వాత రాష్ట్రంలో ఏం చేయాలనేదిచూస్తామని సీఎం ఒక ప్రశ్నకుబదులిచ్చారు. యూపీఎస్సీ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతోనే తాము పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని సీఎం తెలిపారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. గ్లోబరీనావటి సంస్థలు నాడు అక్రమాలకు పాల్పడినా గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో వాళ్లు సీబీఎస్ఈ పరీక్షలవరకు విస్తరించి, వాటిని గందరగోళంచేశారని సీఎం విమర్శించారు. ఇలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనుల విషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలోపరిస్థితుల పరిశీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు సీఎం తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్ కు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం రూ.8వేల కోట్లను బకాయిలను పెట్టి పోయిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎలాంటి వసతులు లేకుండా, దొంగ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్‌కొట్టేయాలనుకునే సంస్థలమీద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని సీఎం తెలిపారు. సక్రమంగా ఉన్న వాళ్లకు బకాయిలుచెల్లిస్తామని ఓ ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు. తాము ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, మా ప్రభుత్వం కారణమన్నట్లుగా బీఆర్ఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బీజేపీవంతపాడుతోందని సీఎం మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు బకాయిలపై బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఎందుకు మాట్లాడడం లేదని సీఎం ప్రశ్నించారు. కూటమిప్రభుత్వం ఉన్న ఏపీలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్యలకు సూచిస్తున్నట్లు సీఎం తెలిపారు. గత ప్రభుత్వం బకాయిలే తమకు భారంగా మారాయని, అయినా అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని సీఎం అన్నారు. భవిష్యత్తులో ఏ సంవత్సరానికి సంబంధించిన ఫీజుల మొత్తం అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లిస్తామని, అడ్వాన్స్‌డ్‌గా బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రూ.2,200 నుంచి రూ.2,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కుఅవసరమవుతాయని సీఎం అన్నారు. క్రమంతప్పకుండా వాటిని చెల్లించేందుకు తమప్రభుత్వం ప్రణాళికలు రచించుకుందని, భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య రాష్ట్రంలో ఉండదని సీఎం స్పష్టం చేశారు.

# నిరసనకారులపై చర్యలు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా, అత్యున్నత న్యాయస్థానం పోలీసుల తీరును తప్పుబట్టింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని గుర్తుచేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. 'నిర్దోషులపై అతిక్రమణలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం ఊరుకోదు, తన పని తాను చేసుకుపోతుంది' అని ధర్మాసనం హెచ్చరించింది. ఈ ఘటనలపై 'స్వతంత్ర విచారణ' జరగాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. 'బాధ్యులను తేల్చనప్పుడు, విచారణకు అర్థమే లేదు' అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు తెలుపడం పౌరుల ప్రాథమిక హక్కు అని అత్యున్నత కోర్టు స్పష్టం చేసింది. నీట్ పరీక్షలో అక్రమాలపై న్యాయం కోరుతూ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న తరుణంలో, వారిపై బలాన్ని ప్రయోగించడం సరికాదని కోర్టు భావించింది. ఈ ఆందోళనల సమయంలో విద్యార్థులపై జరిగిన దాడి మాత్రమే కాకుండా, గాయపడిన పోలీసుల రక్షణ, వారి భద్రతా పరికరాల గురించి కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని కోర్టు పేర్కొంది. శాంతిభద్రతల నిర్వహణ అనేది ద్వితీయ ప్రాధాన్యం కాకూడదని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా వివిధ సందర్భాల్లో జరుగుతున్న నిరసనల సమయంలో శాంతిభద్రతల నిర్వహణకు, అల్లర్లను అదుపు చేయడానికి సంబంధించి ఒకే విధమైన ప్రొటోకాల్ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు వేర్వేరుగా ప్రవర్తించడం సరికాదని, నిర్దిష్ట నియమావళి ఉండాలని సూచించింది.

# హామీల అమలులో కమిటీలదే కీలక పాత్ర

**హైదరాబాద్,జూలై 28 :** పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ హామీల అమలు కమిటీల పాత్ర చాలా గొప్పదని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శాసనసభ సమావేశాల సందర్భంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే విదంగా చూడాల్సిన బాధ్యత హామీల కమిటీదని అన్నారు.
ఆవిధంగా పనిచేయా లని సూచిస్తున్నాను.
నియామాల కమిటీ శాసనసభ సక్రమమైన, సమర్ధవంతమైన ,ప్రజాస్వామ్య బద్ధమైన నిర్వాహణలో అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తుం దన్నారు.

శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో మంగళవారం శాసనసభ ప్రభుత్వ హామీల అమలు కమిటీ , శాసనసభ యొక్క నియమాల కమిటీ , శాసనసభ యొక్క నైతిక విలువల కమిటీల ప్రారంభ సమావేశం జరిగింది.
శాసన సభాపతిగడ్డం ప్రసాద్ కుమార్ , శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, శాసనసభ హామీల అమలు కమిటీ చైర్మన్ పటోళ్ల సంజీవరెడ్డి, సభ్యులు జె. అనిరుధ్ రెడ్డి, జారే ఆదినారాయణలు హాజరయ్యారు.
రూల్స్ కమిటీ సమావేశానికి కమిటీ సభ్యులు దానం నాగేందర్, తూడి మెఘారెడ్డి, భూక్యా మురళి నాయక్, హాజరయ్యారు.
శాసనసభ నైతిక విలువల కమిటీ చైర్మన్ రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి ,కౌన్సిల్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి పాల్గొన్నారు.
రాగద్వేషాలకు అతీతంగా, నిష్పక్షపాతంగా కమిటీలు పనిచేయాలి. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ...శాసనసభలో సభ్యులకు మొదటిగా ఇచ్చేది రూల్స్ బుక్, దానికి అనుగుణంగా స్పీకర్ శాసనసభను నడుపుతారని అన్నారు. సభలో నియమాలను పాటించే విదంగా చూడడంతో పాటుగా, సభ హుందాతనాన్ని కాపాడడంలో విలువల కమిటీది కీలక పాత్ర అన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**హైదరాబాద్,జూలై 28 :**రాబోయే రెండు, మూడు రోజుల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని కేంద్ర వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ ప్రత్యామ్నాయ ప్రణాళిక, వనమహోత్సవం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్.పీ లతో మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఐదు, ఆరు జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదు కాగా 26 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందన్నారు. వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రత్యామ్నాయ ప్రణాళికలో భాగంగా జిల్లాల్లో విత్తన మేళాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల విషయంలో ఏవిధమైన సహాయం కావాలన్నా అందించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని సిఎస్ తెలిపారు. కాగా, రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో విస్తృత స్థాయిలో కురుస్తాయన్న భారత వాతావరణ శాఖ తాజా సూచనల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు.ప్రధానంగా, వివిధ శాఖలతో సమన్వయంతో పని చేయాలన్నారు. భద్రాచలం, ములుగు, నిర్మల్ జిల్లాలలో ఎన్‌డిఆర్‌ఎఫ్ ఈ బృందాలను అందుబాటులో ఉంచామన్నారు. హైదరాబాద్, ఇతర ప్రధాన కేంద్రాల్లో ఉన్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను కూడా అవసరం ఉన్న చోటుకు తరలిస్తామన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్,కార్యదర్శులు దాసరి హరిచందన, సురేంద్ర మోహన్ పాల్గొన్నారు.

# లీక్ నిందితుల్ని శిక్షించాలి

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని హెచ్చరించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందనీ, దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరగాల్సి ఉందన్నారు. సభలో చర్చ జరిగితే రాహుల్ గాంధీ అన్ని అంశాలపై మాట్లాడతారని తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీల నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాన్ని చూసిన తర్వాత రాష్ట్రంలో ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామన్నారు. యూపీఎస్సీ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడం వల్లే తాము రాష్ట్రంలో పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని వివరించారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో ఇంటర్ సహా పలు పరీక్షా పేపర్ల లీకేజీలతో సంబంధం ఉన్న గ్లోబరీనా వంటి సంస్థలపై ఆనాటి సీఎం కేసీఆర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదనీ, దాని ఫలితంగా ఇప్పుడు ఆ అక్రమాలు సీబీఎస్ఈ పరీక్షల వరకు విస్తరించాయని విమర్శించారు. అలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

**క్షేత్రస్థాయి పరిశీలనకు రండి : కేంద్ర మంత్రికి సీఎం ఆహ్వానం**

ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనుల విషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో పరిస్థితుల పరిశీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని తాను కేంద్ర మంత్రిని ఆహ్వానించానని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కు సంబంధించి గత కేసీఆర్ ప్రభుత్వం రూ.8వేల కోట్లను బకాయిలను పెట్టి పోయిందని తెలిపారు. ఎలాంటి వసతులు లేకుండా, దొంగ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్ కొట్టేయాలనుకునే సంస్థలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని తెలిపారు. సక్రమంగా ఉన్నవాళ్లకు బకాయిలు చెల్లిస్తామని ఓ ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు. తాము ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, తమ ప్రభుత్వం కారణమన్నట్లుగా బీఆర్ఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బీజేపీ వంతపాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఏపీలో కోరండి**

కూటమి ప్రభుత్వం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కే రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్యలకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. గత ప్రభుత్వ బకాయిలే తమకు భారంగా మారాయని, అయినా అన్ని సమస్యల్ని పరిష్కరించే ప్రయత్నం.

# రైతుకు సాంకేతికత చేరవేయడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం రైతునేస్తం 100వ ఎపిసోడ్‌ను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రైతు - శాస్త్రవేత్త - అధికారుల అనుసంధానానికి దేశంలోనే తొలి డిజిటల్ వేదిక రైతునేస్తమని అన్నారు. 2024 మార్చి 6న ప్రారంభమైన రైతునేస్తం.. నేడు 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ఇప్పటివరకు 27.30 లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరినట్లు వెల్లడించారు.

ప్రతి మంగళవారం రైతుల ప్రశ్నలకు ప్రత్యక్షంగా శాస్త్రవేత్తలు సమాధానాలు ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ఎల్-నినో సవాళ్లను ఎదుర్కోవడంలో రైతునేస్తం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయిల్ పామ్, ఉద్యాన, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై దృష్టి సారించాలన్నారు. జులైలో 27 శాతం వర్షపాతం లోటు నమోదైందని వెల్లడించారు. ఆగస్టు 10 ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు. భూగర్భ జలాల సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు అందించాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వివిధ జిల్లాలకు చెందిన ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు.

# పరీక్షల సంస్కరణల బిల్లుకు మద్దతు ఇస్తాం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. ప్రస్తుతం దేశానికి జవాబుదారీతనం, పారదర్శకత , దీర్ఘకాలిక సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. డా. కె. రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సుల అమలు ఏమైందో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాగే నందన్ నీలేకని కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నామని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పటికే పార్లమెంట్ ఆమోదించింది.. అయితే దానిని డీలిమిటేషన్‌తో ముడిపెట్టి రాజకీయ గందరగోళం సృష్టించారని విమర్శించారు. డీలిమిటేషన్‌పై ఇప్పటివరకు ప్రభుత్వం ప్రత్యేక బిల్లు తీసుకు రాలేదని వివరించారు. అందుకు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ఉదాహరణ అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో లోక్‌సభ స్థానాలు పెంచాలని చట్టంలో ఉన్నప్పటికీ, 12 ఏళ్లుగా అవి అమలు కాలేదన్నారు. పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్నే అమలు చేయని ప్రభుత్వం.. కొత్త హామీలను ప్రజలు ఎలా నమ్ముతారని సందేహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి జనాభా లెక్కల తర్వాత లోక్‌సభ స్థానాల పునర్విభజన జరగాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 1971 జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్‌ను నిలిపివేసి, ఆ తర్వాత వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ఆ గడువును పొడిగించిందని వివరించారు. ఈ కాలంలో దక్షిణ భారత రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని.. కానీ ఉత్తర భారతంలోని రాష్ట్రాల్లో జనాభా అధికంగా పెరిగిందని సోదాహరణగా తెలిపారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా స్పష్టత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈసందర్భంగా కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సోదరుడి ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో ఉంటది. దాన్ని హైడ్రా ముట్టదు. రాష్ట్ర మంత్రులు వివేక్, శాసనమండలి చైర్మన్ గుత్తు సుఖేందర్ రెడ్డి, రాష్ట్రంలో ఇంకా కీలక నేతలు చాలా మంది బిల్డింగులన్నీ చెరువుల్లో, శిఖాల్లో ఉన్న వాటిని మాత్రం హైడ్రా ముట్టదని కేటీఆర్ అన్నారు. కబ్జాకోరులని ముఖ్యమంత్రి అంటున్నరు. అందరికంటే పెద్ద కబ్జాకోరులే మీ అన్నదమ్ములు కదా.. అందరికంటే ఎక్కువ ఆస్తి దోస్తున్నది.. అందరికంటే ఎక్కువ విధ్వంసం చేస్తున్నది మీ మంత్రులు కదా..? కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టింది నీ మంత్రులు కాదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయిన నాడు రాష్ట్రంలో నిషేధిత భూముల ఎంతంటే మొత్తం 16 లక్షల ఎకరాలు.. ఇవాళ అది కోటి ఎకరాలకు చేరుకుంది. ఏ కారణం చేత కోటి ఎకరాలు పెడుతున్నరు. 30 శాతం కమిషన్ తీసుకోవడం లేదా..? మీ మంత్రులు.. అని ప్రశ్నించారు.

# భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట

**న్యూఢిల్లీ,జూలై 28 :** భవిష్యత్‌లో పేపర్ లీక్‌లు అరికట్టేందుకే యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చలో మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఈ చట్టం ఒక మైలురాయిగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం మోదీ కృషి చేస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనూ ఆర్‌ఆర్‌బీ పేపర్ లీక్ అయ్యిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నోసార్లు పరీక్షా పత్రాలు లీకయ్యాయని మండిపడ్డారు. అయితే పరీక్షల నిర్వహణలో సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించిందని తెలిపారు. 2010లో ఎన్‌టిఎ ఏర్పాటు విజ్ఞప్తిని కాంగ్రెస్ పట్టించుకోలేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ల లీకులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. అందుకోసం 2024 నాటి ప్రవేశ పరీక్షల చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో విద్యార్థులు, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి పేపర్ లీక్ నిరోధక బిల్లు నిదర్శనమని జితేంద్రసింగ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఇవి క్రమంగా వ్యవస్థాగత నేరాలుగా మారాయని, వీటిని అరికట్టేందుకే చట్టంలో మార్పులు చేస్తున్నామని సభకు వివరించారు. 2009, 2011లో ఎన్నో పేపర్‌లు లీకయ్యాయి. 2012లో ఎయిమ్స్ ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ అయ్యింది. యూపీ, తమిళనాడుల్లోనూ ఈ ఘటనలు చోటుచేసు కున్నాయి. ఎన్నో ప్రవేశ, ఉద్యోగ నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. వీటిని అరికట్టేందుకు 1992, 2010లోనూ ప్రయత్నాలు జరిగాయి. అయితే, అవి ఎందుకు పూర్తి కాలేదో నాటి పాలకులే సమాధానం చెప్పాలి. క్రమంగా ఇవి వ్యవస్థాగత నేరాలుగా మారాయి. ఇటీవల నీట్ పేపర్ లీక్ విషయం తెలియగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇటువంటి నేరాలను అరికట్టేందుకు ప్రస్తుతం తీసుకొచ్చిన బిల్లు ఎంతో ఉపయోగకరం. నిందితులను కఠినంగా శిక్షించేందుకు బిల్లులో నిబంధనలు రూపొందించాం. దోషులకు శిక్షలను పదేళ్లకు పెంచాం. లీకేజీ గ్యాంగ్‌లకు జరిమానాను రూ.కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచాం. కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశాం అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం

(మొదటి పేజీ తరువాయి)

గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీ-సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో మీక్షించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ-సర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీసర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. రీ-సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి గారు ఆదేశించారు.

భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. రీ-సర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది కుటుంబ జీవనాధారమని పేర్కొన్న మంత్రి, దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ-సర్వే చేపట్టిందన్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతికత తో శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం వల్ల ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడ తాయని తెలిపారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూముల యాజమాన్యంపై శాశ్వత స్పష్టత ఏర్పడుతుందని మంత్రి తెలిపారు.
దీనివల్ల భూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం నిర్దేశిరచిన లక్ష్యాల మేరకు రీ-సర్వేను విజయవంతంగా పూర్తి చేసి, భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. నక్షా లేని 373 గ్రామాల్లో కూడా రీసర్వే చురుకుగా సాగుతోందని వీలైనంత త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు ముందుగానే పట్టాదారులకు విధిగా నోటీసులు ఇవ్వాలని అదేవిధంగా ఆ గ్రామంలో ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేయాలని గ్రామకంఠం హద్దులను నిర్ణయించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు సంతృప్తి చెందేలా సర్వే చేపట్టాలని ఏది చేసినా ప్రజా కోణంలోనే చేయాలని అన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
బుధవారం, జూలై 29, 2026



# నీటి సంరక్షణపై అవగాహన సమావేశం



**తిమ్మాపూర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రేణికుంట గ్రామంలో మహిళా సంఘ సభ్యులతో నీటి సంరక్షణపై ప్రత్యేక అవగాహన సమావేశాన్ని సర్పంచ్ ఎలుక అంజనేయులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవచ్చని, రైతులు పంట కుంటలు నిర్మించుకోవడం వల్ల సాగునీటికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఊటకుంటలు, బోరుబావుల రీచార్జ్ నిర్మాణాలు ఏర్పాటు చేయడం ద్వారా నీటి మట్టం పెరిగి భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించవచ్చని సూచించారు. నీటి వృథాను నివారించడం, ప్రతి ఇంటిలో నీటి పొదుపు అలవాట్లు పెంపొందించడం, వర్షపు నీటి సంరక్షణలో మహిళలు కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధి కోసం నీటి సంరక్షణను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వార్డు సభ్యుడు బోయిని శంకరయ్య, మహిళా సంఘ సి.ఏ. చెక్కబండి శ్రీలత, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, ఫీల్డ్ అసిస్టెంట్ బోయిని తిరుపతి, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శాకంభరి దేవి స్వరూపంలో దర్శనమిచ్చిన మానసాదేవి అమ్మవారు



**గన్నేరువరం, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గన్నేరువరం మండలం ఖాసీంపేటలోని మానసాదేవి అమ్మవారు శాకంభరి దేవి స్వరూపంలో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కూరగాయలతో అలంకరణ చేసి అభిషేకం, కుంకుమార్చన, విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఘనంగా జగన్నాథ రథయాత్ర



**కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భగత్ నగర్‌లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో జగన్నాథ రథయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, జగన్నాథుని రథయాత్ర భారతదేశంలోని అత్యంత ప్రాచీన వైభవమయిన హిందూ పండుగల్లో ఒకటని, సమానత్వం, భక్తి, సేవా భావానికి గొప్ప సూచికగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు భజనలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తి వాతావరణాన్ని అలరించారు. తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాల విశిష్టతను వివిధ వేషధారణలతో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. లష్కర్ బోనాల ప్రత్యేకతను విద్యార్థులు చక్కగా వివరించారు. పాఠశాల నుండి భగత్ సింగ్ విగ్రహం వరకు ఊరేగింపు నిర్వహించగా, భక్తి వినయం, సమానత్వం, సేవా భావం ప్రధానంగా ప్రతిఫలించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దళితుల అసైన్డ్ భూములను ఆక్రమించుకున్నారని ఏఐఎఫ్బీ ఆరోపణలు



**కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 574లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించిన 15 ఎకరాల పైగా అసైన్డ్ భూమిని జ్యోతిష్మతి విద్యాసంస్థలు చట్టవిరుద్ధంగా ఆక్రమించుకున్నారని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఆరోపించారు. ఈ ఆక్రమణపై 2007లోనే హైకోర్టు వరకు తీర్పులు వచ్చినప్పటికీ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటివరకు భూములను రికవరీ చేయలేక పోయారని ఆయన మండిపడ్డారు. ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) జోక్యం చేసుకుని, కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. నాలుగు వారాల్లోగా చేపట్టిన చర్యలపై నివేదికను కమిషన్‌కు సమర్పించాలని తెలంగాణ అధికారులను ఆదేశించింది. దళితుల అసైన్డ్ భూములను ఆక్రమణదారుల నుండి స్వాధీనం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని బండారి శేఖర్ డిమాండ్ చేశారు.

# నాటిన ప్రతి మొక్కను పెరిగే వరకు కాపాడాలి ఎంపీడీవో రాధా రాథోడ్



**ఖానాపూర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని రాజురా గ్రామపంచాయతీలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాధా రాథోడ్ మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను పెరిగే వరకు కాపాడాలని ప్రజలకు సూచించారు. వనమహోత్సవం ద్వారా భవిష్యత్తులో అడవులు అభివృద్ధి చెంది చల్లని నీడ, పరిశుభ్రమైన గాలి, ఆక్సిజన్ లభిస్తాయని, వర్షాభావ పరిస్థితులు తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిగుంట మల్లేష్, ఉప సర్పంచ్ సంజీవరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి రాణి, ఏపీఓ రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు ప్రారంభం కానున్న కొండగట్టు ఆంజనేయ స్వామి గిరి ప్రదక్షిణ



**కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని కొండగట్టు ఆంజనేయ స్వామి గిరి ప్రదక్షిణ కార్యక్రమం రేపు ఉదయం 5 గంటలకు ప్రారంభం కానుంది. రైతుల సంక్షేమం, సమృద్ధి వర్షాల కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, గిరి ప్రదక్షిణ రాజకీయాలకు అతీతంగా సకలజనుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమమని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగాలని, ప్రజలందరూ ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కొండగట్టు ఆంజనేయ స్వామి నరసింహ, శివ రూపాల సమ్మేళనంగా దేశంలో అరుదైన విగ్రహమని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి భక్తులు దర్శనానికి వస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణపూర్ రిజర్వాయర్ పనులు 90 శాతం పూర్తయ్యాయని, ముంపు గ్రామాలకు పూర్తి పరిహారం అందిస్తామని మేడిపల్లి సత్యం తెలిపారు. గత ప్రభుత్వం ఇవ్వని పరిహారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పించిందని, ప్రాజెక్టు అడ్డుకునే ప్రయత్నాలను తిప్పికొడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు, సహకార పరపతి చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గంగన్న, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీజేపీ ప్రవాస్ అభియాన్ కార్యక్రమాలు





**కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో కరీంనగర్, హుజురాబాద్ పట్టణాల్లో ప్రవాస్ అభియాన్ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కరీంనగర్‌లో జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, స్వచ్ఛమైన ఓటరు జాబితా ద్వారానే బలమైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందని, అర్హులెవరూ తమ ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని పార్టీ శ్రేణులను పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పిస్తూ, పారదర్శకమైన జాబితా తయారీకి కృషి చేయాలని సూచించారు. హుజూరాబాద్‌లో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరై, బూత్ స్థాయిలో సమీక్షలు జరుపుతూ ప్రతి ఓటరును వ్యక్తిగతంగా సంప్రదించాలని సూచించారు. డ్రాఫ్ట్ జాబితా విడుదలైన తర్వాత పేర్లు లేని అర్హులైన ఓటర్లను ఫారం-6 ద్వారా నమోదు చేయాలని, ఆన్‌లైన్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ కొలగాని శ్రీనివాస్, తూర్పాటి రాజు, గంగిశెట్టి ప్రభాకర్, రావుల వేణు, తూర్పాటి లక్ష్మీ దుర్గ, ఇతర నాయకులు, బి.ఎల్.ఎ-2లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అదనపు బూత్ ఏర్పాటు చెయ్యాలని ఎమ్మార్వోకి వినతి



**హుస్నాబాద్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీజేపీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోతారం (ఎస్) గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు, మండల సంయోజక తోట స్వరూప ముఖ్య అతిథిగా హాజరై పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి కార్యకర్త చురుగ్గా పాల్గొని పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం హుస్నాబాద్ ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. పోతారం (ఎస్) గ్రామంలో ఒకే బీఎల్ఓ పరిధిలో 1,200కు పైగా ఓటర్లు ఉండటంతో అదనపు బూత్ ఏర్పాటు చేసి ప్రత్యేక బీఎల్ఓను నియమించాలని కోరారు. అలాగే దేవేంద్రనగర్ వాసులు వాగును దాటి ఓటు వేయాల్సి రావడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున అక్కడ కూడా అదనపు బూత్ ఏర్పాటు చేయాలని డిప్యూటీ తహసిల్దార్ రుక్మిణికి వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో మాజీ అధ్యక్షుడు చెక్కబండి విద్యాసాగర్, ఉపాధ్యక్షులు భూతగడ్డపు బాలరాజు, బత్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు తడిసిన రమేష్, బైరి అరుణ్, బూత్ అధ్యక్షులు వంగ శ్రీనివాసరెడ్డి, బొల్లి సుధాకర్, బొమ్మగాని ఈశ్వర్, పోలు సందీప్, గంటల రాజేందర్, గుగులోతు రాములు, గుజ్జుల బాలరాజు, ప్రశాంత్, మెరుగు రవి, సీనియర్ నాయకులు పుదరి కిష్టయ్య, ఇటికాల కుమారస్వామి, పిట్టల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శక ఓటరు జాబితా కోసమే ఎస్ఐఆర్ కార్యక్రమం

**- బోయినపల్లి ప్రవీణ్‌రావు**



**కొడిమ్యాల, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పారదర్శక ఓటరు జాబితా తయారీకి కీలకమని కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. కొడిమ్యాల మండల బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మరణించినవారి, వలస వెళ్లినవారి, నకిలీ ఓటర్ల పేర్లను తొలగించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. పార్టీ శ్రేణులు బూత్ స్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదే సమయంలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ దేశంలో అశాంతి సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్య ముసుగులో నిరాధార ఆరోపణలు చేస్తూ రాజకీయ డ్రామాలతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌ను తిరస్కరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బండ నరసింహరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు బుచ్చి రాములు, అంకం పద్మ, ప్రశాంత్ గౌడ్, నాంపల్లి రాజేశం, తిరుపతి, భూమేష్, రాజ్‌కుమార్, బాబు, అంజి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి - ఎమ్మెల్యే కవ్వంపల్లి



**మానకొండూర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతీబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం, యూనిఫాంలు, పుస్తకాలు వంటి అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గురుకుల విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలను పెంపొందించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలికలతో కలిసి భోజనం చేసి స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ తహసీల్దార్ విజయ్‌కుమార్, పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కొండల్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మద్రి ఓదెలు యాదవ్, స్థానిక సింగిల్ విండో చైర్మన్ నాగిశెట్టి రాజయ్య, పార్టీ నాయకులు రేమిడి శ్రీనివాస్ రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, పెంచాల కిషన్‌రావు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక




# ఉప సర్పంచులకు , వార్డు సభ్యులకు గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్



**సిద్దిపేట, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉప సర్పంచులకు నెలకు రూ.5,000, వార్డు సభ్యులకు రూ.3,000 గౌరవ వేతనం చెల్లించాలని, పలు సమస్యలను పరిష్కరించాలని కోరు తూ సిద్దిపేట జిల్లా ఉప సర్పంచులు, వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉప సర్పంచుల రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ పిలుపు మేరకు జిల్లా ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మడుగురి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి సుమారు 200 మంది పాల్గొన్నారు. వినతిపత్రంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద పూర్తి స్థాయి చెక్ పవర్ అధికారాలు కల్పించాలని, మండల సమావేశాల్లో తగిన గౌరవం ఇవ్వాలని, గ్రామ అభివృద్ధి పనుల శిలాఫలకాలపై ఉప సర్పంచులు, వార్డు సభ్యుల పేర్లు తప్పనిసరిగా పొందుపరచాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ సమస్యలపై సానుకూలంగా స్పందించి, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షులు సురేష్, నర్సింగరావు, పర్వతం సారయ్య, చింతకింది సింగరయ్య, సంపతి ప్రభాకర్ రెడ్డి, మార్గం తిరుపతి, పిల్లి రజిని తదితరులు పాల్గొన్నారు.

# యువత సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి




**- జాగీర్ సత్యనారాయణ**

**హుస్నాబాద్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిరుద్యోగం, ప్రైవేటీకరణ, విద్యా--ఉపాధి రంగాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి యువత ఐక్యంగా ఉద్యమించాలని సీపీఐ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. హుస్నాబాద్ పట్టణంలోని అనబేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఏఐవైఎఫ్ హుస్నాబాద్--అక్కన్నపేట మండలాల మహాసభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని, కార్పొరేట్ ప్రయోజనాల కోసం ప్రభుత్వ వ్యవస్థలను బలహీనపరుస్తున్న పాలకులపై పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేష్ మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో పారదర్శకత, విద్యా--వైద్య రంగాల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం సమగ్ర సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రైవేటీకరణ, కార్మిక వ్యతిరేక విధానాలు యువత ఆశయాలను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. ఈ మహాసభలో ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో గ్రంథాలయం ఖాళీ చేయాలనీ కలెక్టర్‌కు వినతి



**హుస్నాబాద్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయాన్ని ఖాళీ చేయాలని సంఘం ప్రతినిధులు సిద్ధిపేట జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తక్కలపల్లి రాజగోపాల్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. లింగారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు ఆర్. రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జైన్ సత్యం, జిల్లా ఉపాధ్యక్షుడు కృపాసాగర్ తదితరులు మాట్లాడుతూ, రిటైర్డ్ ఉద్యోగుల కార్యకలాపాలకు భవనం అవసరం ఉందని, అందువల్ల గ్రంథాలయాన్ని ఖాళీ చేసి భవనాన్ని సంఘం వినియోగానికి అందుబాటులోకి తేవాలని కోరారు. జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# వర్షాకాల సమస్యల నివారణకై డ్రైనేజీల సిల్టేషన్ పనులు ప్రారంభం



**సుల్తానాబాద్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సుల్తానాబాద్ మున్సిపాలిటీలోని 10వ వార్డులో డ్రైనేజీల సిల్టేషన్ పనులు చేపట్టారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఆదేశాల మేరకు వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలతతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు రాధాకృష్ణ, కమిషనర్ టి. రమేష్ ఆధ్వర్యంలో జేసీబీతో డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలు డ్రైనేజీల్లో చెత్త వేయకుండా సహకరించాలని, తడి చెత్త--పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిద్దాం



**- తాండ్ర అంజయ్య**

**సుల్తానాబాద్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సుల్తానాబాద్‌లో సీఐటీ యూ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్స్ కార్మికులకు నష్టం చేస్తాయని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యంత్రాలతో నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ సవరణ చట్టం రైతులు, పేదలకు ఇబ్బందులు కలిగిస్తుందని, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వల్ల దేశీయ రైతులు గిట్టుబాటు ధర కోల్పోతున్నారని తెలిపారు. గ్యాస్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ అంశాలపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, ఆగస్టు 10న జరగనున్న 'జైలు భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ గుమస్తాల సంఘం అధ్యక్షుడు మాతంగి రాజమల్లు, ఆపరేటర్ల సంఘం ప్రధాన కార్యదర్శి నౌపుండ్ల బ్రహ్మాచారి, సంపత్, శంకర్, సదయ్య, రవి, స్వామి, వేణు, కిరణ్, నవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# శాతవాహన విశ్వవిద్యాలయ ఆచార్యురాలికి అంతర్జాతీయ పురస్కారం



**కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగం సహాయ ఆచార్యురాలు డాక్టర్ ఎం. సరసిజకు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక మహిళా పరిశోధక పురస్కారం లభించింది. జూలై 24--25 తేదీల్లో పాండిచ్చేరిలో జరిగిన నాలుగో అంతర్జాతీయ సదస్సు మరియు పురస్కార కార్యక్రమంలో ఆమెకు ఈ గౌరవం లభించింది. “పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచే పచ్చదనం రసాయన సాంకేతిక పద్ధతులు” అనే అంశంపై ఆమె సమర్పించిన పరిశోధన పత్రానికి గుర్తింపుగా ఈ పురస్కారం అందించారు. డాక్టర్ సరసిజ సాధించిన ఈ విజయంతో విశ్వవిద్యాలయ ప్రతిష్ట మరింత పెరిగిందని ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్‌కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య పి. సతీష్‌కుమార్ అభినందించారు. ఇలాంటి పురస్కారాలు అధ్యాపకులను పరిశోధన రంగంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రోత్సహిస్తాయని వారు పేర్కొన్నారు.

# పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఉపకులపతి ఆచార్య ఉమేశ్‌కుమార్



**కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న ఎల్‌ఎల్‌బీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలను విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాలలో ఉపకులపతి ఆచార్య ఉమేశ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, సీటింగ్ అమరికలు, పరీక్షల నిర్వహణ తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ నిబంధనలకు లోబడి పరీక్షలను పారదర్శకంగా, కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. పరీక్షా హాల్లో మాల్‌ప్రాక్టీస్‌కు తావులేకుండా నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్, డాక్టర్ సరసిజ పాల్గొన్నారు.

# బంజారా ఆరాధ్య దైవాన్ని దర్శించుకున్న కార్పొరేటర్



**కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పదవ డివిజన్ కార్పొరేటర్ సొగాని కొమురయ్య మంగళవారం ఉదయం బంజారా ఆరాధ్య దైవం శీతల భవానిని దర్శించు కున్నారు. అమ్మవారి ఆశీస్సులు దేశ ప్రజలందరిపై ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు సమయానికి కురవాలని ఆయన ప్రార్థించారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఎస్ఐఆర్ ఫారాలపై దిశానిర్దేశం గుజ్జ శ్రీనివాసరావు



**కరీంనగర్ రూరల్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బొమ్మకల్ ఆరవ డివిజన్‌లో ఎస్ఐఆర్‌పై సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా నాయకుడు, రూరల్ మండల ఎస్ఐఆర్ ప్రబారి గుజ్జ శ్రీనివాసరావు హాజర య్యారు. ప్రజలందరూ తమ ఎస్ఐఆర్ ఫారాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసి, ఎన్యూమరేట్ ఫారాలను బీఎల్‌ఓలకు తిరిగి ఇవ్వాలని సూచించారు. లేని యెడల ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గడువు త్వరలో ముగియనున్నందున ఎస్ఐఆర్ పూర్తయ్యే వరకు బీజేపీ బీఎల్ఈలు, బూత్ ప్రభారులు, నాయకులు ఓటర్లకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మేకల వెంకటేష్, ఈస్ట్ జోన్ అధ్యక్షుడు అవుదుర్తి శ్రీని వాస్, రైల్వే బోర్డు సభ్యుడు పాశం తిరుపతి, శశికాంత్, రామచంద్రం, బీజేపీ నాయకులు గాలిపల్లి నారాయణ, పెద్ది లక్ష్మణ్, పుట్టపాక శ్రీధర్, మల్లేష్, శ్రీకాంత్, అనిల్, శశి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**ఖానాపూర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని పి.ఆర్.టి.యు భవన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఖానాపూర్ 2026--27 సంవత్సరానికి 20వ ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం సాయంత్రం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాస్ట్ జిల్లా గవర్నర్ బసవేశ్వర్‌రావు హాజరై ప్రసంగించారు. ప్రపంచంలో ఏ స్వచ్ఛంద సంస్థ చేయని సేవా కార్యక్రమాలను లయన్స్ ఇంటర్నేషనల్ చేపడుతోందని, సమాజానికి సేవ చేస్తే భగవంతుడు కుటుంబానికి ఎనలేని మేలు చేస్తాడని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాస్ట్ జిల్లా గవర్నర్ లయన్ వి. లక్ష్మి కొత్త కార్యవర్గ సభ్యులకు ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా చేరిన సభ్యులు కిషన్, డాక్టర్ సాయికేతన్ రెడ్డి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సుదర్శన్, బెజ్జారపు రాజేశ్వర్‌లకు పిన్ అమర్చి క్లబ్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా రవాణా అధికారి అజ్మీర శ్యామ్ నాయక్, లోక్ జాగరణ్ దినపత్రిక సంపాదకులు అల్వాల హన్మంతు, రీజియన్ చైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, జిల్లా జాయింట్ క్యాబినెట్ సెక్రటరీ ఎం. రాజన్న, జోన్ చైర్మన్ చంద్ర మోహన్ రెడ్డి, రీజియన్ సెక్రటరీ చాకు లింగం, ఏరియా కోఆర్డినేటర్ కె. గంగారెడ్డి, క్లబ్ కార్యదర్శి రాచమల్ల రాజశేఖర్, కోశాధికారి పి. రాంచందర్, ప్రోగ్రామ్ చైర్మన్ కారింగుల వెంకటేశ్వర్లు, కో--చైర్మన్ ఏ. సంజీవరావు, మాస్టర్ ఆఫ్ సెరమనీ పాలెపి సుదర్శన్, కొండాడి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లయన్స్ క్లబ్ సేవా భావాన్ని ప్రతిబింబిస్తూ విజయవంతంగా ముగిసింది.

# సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో మాక్ ఎన్నికలు, ఘనంగా ఇన్వెస్టిచర్ వేడుకలు



**కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జ్యోతి నగర్‌లోని సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించేందుకు మాక్ ఎన్నికలు, ఇన్వెస్టిచర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్నికలు పూర్తిగా బ్యాలెట్ విధానంలో జరిగాయి. విద్యార్థులే బూత్ అధికారులు, ఎలక్షన్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించడం విశేషం. ఓట్ల లెక్కింపు కూడా విద్యార్థుల సమక్షంలోనే జరిగింది. హెడ్ బాయ్‌గా ఆన్స్ తేజ్, హెడ్ గర్ల్‌గా అక్షర ఎన్నికయ్యారు. క్రీడా రంగానికి శ్రీ వర్షిత్, పవనసుత స్పోర్ట్స్ కెప్టెన్లుగా ఎంపికయ్యారు. నాలుగు హౌస్‌లకు విద్యార్థులను కెప్టెన్లుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అనంతరం గెలుపొందిన విద్యార్థులకు శషర్ట్స్, క్యాప్స్, బ్యాడ్జెస్, సర్టిఫికెట్లు అందించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, ఓటు ప్రాధాన్యతను తెలియజేయడమే ఈ ఎన్నికల ఉద్దేశం. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కుమారస్వామి, ప్రైమరీ ప్రిన్సిపల్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నగరాన్ని పచ్చదనంతో నింపే లక్ష్యంతో ఘనంగా వన మహోత్సవం



**కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరాన్ని పచ్చదనంతో నింపే లక్ష్యంతో వన మహోత్సవం కార్యక్రమాన్ని 53వ డివిజన్ సాయి నగర్‌లో మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. కరీంనగర్‌ను క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రారంభోత్సవంలో ఒకే రోజు 500 మొక్కలను నాటగా, నగరవ్యాప్తంగా ప్రతి ఇంటికి రెండు చొప్పున పూల లేదా పండ్ల మొక్కలను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. మొత్తం మూడు లక్షల మొక్కలను ఉచితంగా పంపిణీ చేసి, మరో లక్ష మొక్కలను వివిధ డివిజన్లలో నాటే ప్రణాళిక ఉందని వివరించారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షిస్తూ నగరాన్ని సుందరంగా మార్చడంలో భాగస్వాములు కావాలని మేయర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొంపెల్లి శ్వేత రమన్, వంగల పవన్ కుమార్, కాలనీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

# ఘనంగా తండాలో శీతల పండుగ వేడుకలు



**ఖానాపూర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని బావాపూర్ ఆర్ తండాలో బంజారాల జాతీయ పండుగ శీతల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయక్ రామారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కుటుంబ సమేతంగా మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొని సాంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహిస్తారని తెలిపారు. పండుగ వేడుకలకు బంధువులు కూడా విచ్చేసి ఆనందంగా జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయక్ చౌహాన్ రామారావు, జవహర్లాల్, సర్పంచ్ బాబురావు, కిషన్, జింత నాయక్‌లు పాల్గొన్నారు.

# 100శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేసిన బి.ఎల్.ఓ, బి.ఎల్.ఎలకు కౌన్సిలర్ అభినందనలు



**ఖానాపూర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎన్నికల కమిషన్ ఇచ్చిన గడువు లోపల ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డ్ పద్మావతి నగర్‌లోని 233, 237 బూత్‌లలో 100శాతంగా ప్రక్రియ పూర్తయిందని వార్డ్ కౌన్సిలర్ నిమ్మల రమేష్ తెలిపారు. ఈ సర్ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారమ్‌ను పూర్తిచేయడంలో సహకరించిన వరలక్ష్మి, ధనలక్ష్మి బి.ఎల్.ఓలు, జూనీ సాగర్, ఎండి ఇర్ఫాన్ బి.ఎల్.ఎలు, వార్డ్ ఆఫీసర్ చేతన్, ఎం.డి.సి. పోలా బన్ను, మున్సిపాలిటీ, రెవెన్యూ సిబ్బంది, కాలనీవాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కౌన్సిలర్ నిమ్మల రమేష్ ఈ విజయవంతమైన ప్రక్రియలో భాగస్వాములైన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# శాతవాహనలో ఆర్థిక శాస్త్రంలో కంప్యూటర్ అనువర్తనాలపై కార్యశాల




**కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయ ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు డిజిటల్ నైపుణ్యాలపై ఒకరోజు కార్యశాల ఆర్ట్స్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఉమేశ్ కుమార్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో డిజిటల్ నైపుణ్యాలు అత్యంత అవసరమని, ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలను పెంచుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రార్ సతీష్ కుమార్ మాట్లాడుతూ ఎక్సెల్ వంటి సాఫ్ట్వేర్ వినియోగం ద్వారా పరిశోధన డేటా విశ్లేషణలో మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని వివరించారు. కార్యశాలలో విద్యార్థులకు ఎంఎస్ ఆఫీస్, డేటా విశ్లేషణ, గ్రాఫ్‌లు, చార్టులు, ఆర్థిక గణాంకాల ప్రాథమిక విశ్లేషణ, ఇంటర్నెట్ ఆధారిత నైపుణ్యాలు, కృత్రిమ మేధస్సు వినియోగంపై రిసోర్స్ పర్సన్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మావతి, కన్వీనర్ శ్రీవాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపులో విద్యార్థులకు ధృవపత్రాలు అందజేశారు.

# మున్సిపల్ కౌన్సిలర్లకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహణ





హుస్నాబాద్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ (ఎన్ఐయూఎమ్), ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్ఐఐ) ఆధ్వర్యంలో హుస్నాబాద్ వార్డ్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమం గచ్చిబౌలిలో నిర్వహించారు. ఈ శిక్షణలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2026, జల్ సంచయ్, జన భాగిదారి, మున్సిపల్ చట్టం 2019, అమృత్ సబ్ స్కీమ్స్, క్యాచ్ ది రెయిన్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు బూరుగు లత, పిల్లి తిరుపతి, సావుల మంజుల, పూదరి వరప్రసాద్, కేశవేని రమేష్, బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్ ప్రసాద్, గాదెపాక రవీందర్, వాల సుప్రజ, బత్తుల స్వరూప, శోభన్ బాబు, కో ఆప్షన్ సభ్యులు హసన్, సరోజన తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా ప్రక్రియ 100శాతం పూర్తి - సర్పంచ్ మల్లేష్



ఖానాపూర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ మండలంలోని దిలావర్పూర్ గ్రామపం చాయతీలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా (ఎస్ఐఆర్) ప్రక్రియ 100% పూర్తయిందని సర్పంచ్ చింతల మల్లేష్ తెలిపారు. గ్రామంలో మొత్తం 824 ఓటర్లు నమోదు కాగా, 25 డబ్బులు ఓట్లు, 32 చనిపోయిన ఓట్లు, 42 ఇతర ప్రాంతాలకు షిఫ్ట్ అయిన ఓట్లు తొలగించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బి.ఎల్.ఓ సత్యవ్వ, బి.ఎల్.ఎ వాల్గోటు సాయి కృష్ణ, జిపిఓ భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సూర్యనంద్, ఉప సర్పంచ్ ఓరుగంటి రాజేశ్వర్, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు నబి ఖాన్, కామాజి శ్రీనివాస్, సంతోష్ గుగ్గిళ్ళ, బత్తిని శేఖర్, వార్డు సభ్యులు అరె శేఖర్, వాల్గోటు లాస్య, ఆశా కార్యకర్త మీనుగు కమల, కారోబార్ పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు



పెద్దపల్లి, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గత రెండు సంవత్సరాల్లో రూ.131 కోట్ల విలువైన వైద్య సేవలు అందించామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో 2081 ఆర్థో సర్జరీలు, 6478 జనరల్ సర్జరీలు, 3096 కటారాక్ట్ ఆపరేషన్లు, 5067 డెలివరీలు జరగ్గా, రికార్డు స్థాయిలో 5 లక్షల మందికి పైగా మందులు అందించామని వివరించారు. అదేవిధంగా 990 నవజాత శిశువులకు ప్రత్యేక వైద్య సేవలు అందించామని తెలిపారు. ఆసుపత్రి ఆధునీకరణ కోసం రూ.52 కోట్లతో 50 పడకల నుండి 100 పడకలకు విస్తరణ పనులు జరుగుతున్నాయని, అత్యాధునిక పరికరాలు, కొత్త అంబులెన్స్, ఎస్ఎన్సియు యూనిట్ ఏర్పాటు చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ఆసుపత్రి రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థాయికి చేరిందని ఎమ్మెల్యే విజయరమణరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్, వైద్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పబ్బతి ఆంజనేయ స్వామిని దర్శించుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్



అమ్రాబాద్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమలలో ప్రసిద్ధి చెందిన మద్దిమడుగు గ్రామంలోని శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామిని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య తీర్థప్రసాదాలు అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. గ్రామ ప్రజలు, భక్తులు మంత్రికి, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ప్రజల ఆశీర్వాదం, దైవానుగ్రహమే తమకు బలం అని, ప్రజాసేవే తమ లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై ఎమ్మెల్యే సమీక్ష సమావేశం



మానకొండూర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మానకొండూర్ నియోజక వర్గంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గ్రామాల్లో పర్యటించి సమీక్షలు నిర్వహిం చారు. అన్నారం, దేవంపల్లి, మానకొండూర్ గ్రామాల్లో పార్టీ నియోజకవర్గ సర్ ఇంచార్జీ కొండల్ రెడ్డితో కలిసి బూత్ లెవల్ ఏజెంట్లు, బీఎల్వోలతో సమావేశమై సవరణ ప్రక్రియ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా కృషి చేయాలని, అనర్హులు లేదా ద్వంద్వ నమోదులను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. బూత్ స్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించాలని, బీఎల్వోలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సత్యనారాయణ, పార్టీ నాయకులు, బీఎల్ఏలు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# కారు లారీ ఢీ.. తప్పిన పెను ప్రమాదం

సుల్తానాబాద్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సుల్తానాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం కారు, లారీ ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. ప్రమాదంలో రెండు వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నప్పటికీ ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన కారణంగా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ కొనసాగుతోంది.

# ఆమనగల్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

**- 100 కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు కసరత్తు**



ఆమనగల్లు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు వేగవంతమయ్యాయి. మున్సిపాలిటీలో సుమారు 100 కొత్త విద్యుత్ స్తంభాల అవసరాన్ని గౌరవ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సూచన మేరకు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ మంగళవారం కందుకూరులో విద్యుత్ శాఖ డీఈ గోపాలకృష్ణను కలిసి ఆమనగల్ పట్టణంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పాత విద్యుత్ స్తంభాల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కొత్త స్తంభాల ఏర్పాటు అవసరం, విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడేలా తీసుకోవాల్సిన చర్యలను డీఈ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీఈ గోపాలకృష్ణ సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖతో నిరంతరం సమన్వయం కొనసాగి స్తామని మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు పూసల సత్యం, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# సూదిని జైపాల్ రెడ్డికి ఘన నివాళి

**- స్ఫూర్తి స్థల్ వద్ద నివాళులర్పించిన టీడీపీ రాష్ట్ర నాయకులు అందేకార్ యాదిలాల్**



ఆమనగల్లు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మాజీ కేంద్ర మంత్రి, దివంగత ప్రజానేత సూదిని జైపాల్ రెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా టీడీపీ రాష్ట్ర నాయకులు, ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అందేకార్ యాదిలాల్ ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని స్ఫూర్తి స్థల్‌లో జైపాల్ రెడ్డి సమాధి వద్ద పూలమాలలు వేసి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అందేకార్ యాదిలాల్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో, పార్లమెంటు వ్యవహారాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప రాజకీయవేత్తగా జైపాల్ రెడ్డి చిరస్థాయిగా గుర్తుండిపోతారని అన్నారు. ఆయన నిజాయితీ, విలువలతో కూడిన రాజకీయాలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, చరికొండ సర్పంచ్ మహేందర్ గౌడ్, నాయకులు రాజిరెడ్డి, కోట నర్సింహ తదితరులు పాల్గొని జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# అమెరికాలో ఆమనగల్లు కుటుంబానికి తీరని విషాదం

**- న్యూజెర్సీ రోడ్డు ప్రమాదంలో దీపారెడ్డి మృతి**



ఆమనగల్లు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లికి చెందిన శ్రీపాతి దీపారెడ్డి (44) మృతిచెందారు. సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటనతో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మాడుగుల మండల కేంద్రానికి చెందిన పట్టాభి శేఖర్‌రెడ్డి, శశిరేఖ దంపతుల కుమార్తె అయిన దీపారెడ్డికి 20 ఏళ్ల క్రితం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డితో వివాహమైంది. అనంతరం దంపతులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తూ న్యూజెర్సీలో స్థిరపడ్డారు. సిగ్నల్ వద్ద కారు ఆగి ఉండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై దీపారెడ్డి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి సంస్కృత, హర్షిత అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దీపారెడ్డి ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# మేడిగడ్డ తాండలో గ్రామసభ.. అభివృద్ధిపై కీలక చర్చలు

**- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత**
**- ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్**



ఆమనగల్లు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీలో సర్పంచ్ శ్రీమతి రాజేశ్వరి మల్లేష్ అధ్యక్షతన గ్రామసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, తాగునీటి సమస్యలు, పారిశుద్ధ్యం, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు సీతారాం, మల్లేష్, దేవేందర్, ప్రేమలత, జయందర్, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, జీపీవో మనిల, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి సందర్భంగా నేడు ఎలిగేడు సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎలిగేడు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఎలిగేడు మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సుజిత్ కుమార్ తెలిపారు. ఉదయం 6 గంటలకు అభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, సాయంత్రం పల్లకి సేవ నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# నిమ్మకాయల మాలలతో దుర్గాభవానీ అమ్మవారి అలంకరణ



కరీంనగర్ రూరల్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఆషాడమాస శాకంబరీ ఉత్సవాల భాగంగా అమ్మవారిని నిమ్మకాయల మాలలతో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ విశేష హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉత్సవాల చివరి రోజు కావడంతో 54 రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అలంకరించేందుకు అన్నమయ్య సేవా ట్రస్టు సభ్యులు మాలలు కట్టారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# జూలై 29, 30 తేదీల్లో జరగనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు




కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూలై 29, 30 తేదీల్లో కరీంనగర్‌లో రాష్ట్ర కమిటీ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య హాజరుకానున్నారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కా రానికి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జాన్సన్ తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కొరత, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ వంటి అంశాలను సమావేశాల్లో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులను నియంత్రించే చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రామడుగు మండల కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా 150 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్ధూ, అభిరామ్, ఓంకార్, మహేందర్, ప్రేమ్, వినయ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై విచ్చలవిడిగా పార్కింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్




కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అంబేద్కర్ స్టేడియం సెకండ్ గేట్ నుండి ఎల్ఐసి ఆఫీస్ వరకు రోడ్లపై విచ్చలవిడిగా వాహనాలు పార్క్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ బి. యాదగిరి స్వామికి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ రోడ్ల ఇరువైపులా చిరు వ్యాపారస్తులు, హోటల్లు, సోడా బండ్లు, పండ్ల వాహనాలు ఆక్రమించడంతో పాటు వైన్స్, బార్ల వద్ద పార్కింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వృద్ధులు, మహిళలు, విద్యార్థులు నిత్యం ఈ మార్గంలో ప్రయాణిస్తున్నందున ట్రాఫిక్ సమస్యలు మరింత పెరుగుతున్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కసిబోజుల సంతోష్ చారి, సహాయ కార్యదర్శి కాల్వ శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులు చంచల మురళి, కోశాధికారి పెనమల్ల ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో రూ.700 కోట్ల కుంభకోణం గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి



సుల్తానాబాద్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పెద్దపల్లి నియోజకవర్గంలో హెచ్‌డటీ గోదాముల ద్వారా కరీఫ్, రబీ సీజన్ల ధాన్యం కొనుగోళ్లలో రూ.700 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి ఆరోపించారు. సుల్తానాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి లారీపై రైతుల నుంచి రూ.18 వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యే అండదండలతో రైస్ మిల్లర్లు, గోదాం నిర్వాహకులు, కొందరు అధికారులు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. ఎఫ్‌సీఐ అన్ని ఖర్చులు భరిస్తున్నప్పటికీ రైతులపై అదనపు భారం మోపడం అన్యాయమని అన్నారు. గోదాముల వద్ద జరుగుతున్న అక్రమ వసూళ్లపై అధికారులు స్పందించి, సీఎంఆర్ అప్పగించని రైస్ మిల్లులు, ధాన్యం స్వీకరించని నిర్వాహకులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశానికి సంబంధించిన ఆధారాలను కేంద్ర ప్రభుత్వం, ఈడీ, సీబీఐలకు అందజేస్తామని, దోషులకు శిక్ష పడే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్, కాసాగోని నిర్మల, రఫీక్, అంజన్ రంజా, బండారి లత, మెండే శంకరయ్య, కొమ్మిడి రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డీటీఆర్ పనుల కారణంగా విద్యుత్ అంతరాయం



కరీంనగర్ రూరల్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గౌడ్స్ కాలనీ ప్రాంతంలోని సీతారాంపూర్ 11 కేవీ ఫీడర్‌పై డీటీఆర్ నిర్మాణ పనుల కారణంగా జూలై 28న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏడీఈ గడం రఘు తెలిపారు. ఈ ప్రభావిత ప్రాంతాలు గౌడ్స్ కాలనీ, రేకుర్తి చౌరస్తా, కాలోజినగర్‌గా పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయం సమయంలో వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి బిరుదు రాధాకృష్ణ



సుల్తానాబాద్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదేశాల మేరకు సుల్తానాబాద్ మున్సిపాలిటీలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం మంగళవారం నిర్వహించారు .మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు రాధాకృష్ణ, కమిషనర్ టి. రమేష్‌తో కలిసి నాలుగో వార్డులో పూసాల రోడ్డును సందర్శించి, బూత్ లెవల్ అధికారులకు ఓటరు జాబితా సవరణ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పట్టణంలోని పలు వార్డులను పరిశీలించి కార్యక్రమం పురోగతిని సమీక్షించారు.

## దుర్షేడ్ స్మశాన వాటికలో నూతన బోర్ మోటర్ ఏర్పాటు



కరీంనగర్ రూరల్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): 4వ డివిజన్ దుర్షేడ్ స్మశాన వాటిక వద్ద పాత బోర్ మోటర్ రిపేర్ అవ్వడంతో స్థానిక ప్రజలు కార్పొరేటర్ భూపతి రవీందర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చర్యలతో 7.5 హెచ్‌పి కొత్త బోర్ మోటర్ సాంక్షన్ చేసి, బోరులో అమర్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, జవాన్, శానిటేషన్ సిబ్బంది, ఫిల్టర్ బెడ్ నల్ల సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సమావేశం నిర్వహణ



కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ తారక హోటల్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా నాయకుల సమావేశం జరిగింది.రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు జిల్లా చైర్మన్ జి.ఎస్. ఆనంద్ ఆధ్వర్యంలో, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కదారి అయిలన్న కురుమను ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా నియమించారు.ఈ సందర్భంగా జి.ఎస్. ఆనంద్ మాట్లాడుతూ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ హామీల సాధన కోసం కృషి చేస్తామని, అవసరమైతే మరో ఉద్యమానికి సిద్ధమవుతామని తెలిపారు. ఉద్యమకారుల కమిటీ కాలయాపన కాకుండా కాలపరిమితి కమిటీగా పనిచేయాలని సూచించారు. కదారి అయిలన్న కురుమ బాధ్యతలు స్వీకరించి ఉద్యమకారుల హక్కుల కోసం కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో కలర్ సత్తన్న గౌడ్, గోడిశల రమేశ్ గౌడ్, బొల్లం లింగమూర్తి, పల్లె నారాయణ గౌడ్, మెతుకు సత్యం, రవి యాదవ్, దావేర మహేశ్, ఓగేటి బిందు, కారంగుల సుజాత, గడ్డం లత, తుమ్మనపల్లి రేణుక తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్‌లో ఘనంగా జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం వేడుకలు




కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంకమ్మతోట బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో జాతీయ తల్లిదండ్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. 45వ డివిజన్ కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై తల్లిదండ్రుల పాత్రను నొక్కి చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉపాధ్యాయులు, సిబ్బందికి పర్యావరణ అనుకూల వస్త్ర సంచులు పంపిణీ చేసి, విద్యార్థులకు చాక్లెట్లు పంచారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మ్యాడం శివకాంత్, బట్టు వినోద్, మేతుకు కృష్ణ చైతన్య, ముక్క శరత్ కృష్ణ, రాచకొండ సంతోష్, సింగమరాజు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.సమాజ సేవ, విద్య, పర్యావరణ పరిరక్షణ పట్ల లయన్స్ క్లబ్ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ కార్యక్రమం ముగిసింది.?

# ప్రాథమిక విద్యార్థులకు చదవడం, రాయడం పటిష్టంగా నేర్పించాలి - కలెక్టర్ కే. హైమావతి



సిద్దిపేట, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రాథమిక పాఠశాలల్లో మొదటి, రెండో తరగతి విద్యార్థులకు చదవడం, రాయడం తప్పనిసరిగా నేర్పించాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. 108 మంది విద్యార్థులకు వండిన భోజనం నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తరువాత ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మొదటి--రెండో తరగతుల నుంచే చదవడం, రాయడం నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మూడో--నాలుగో తరగతుల విద్యార్థులకు కార్యకలాపాల ఆధారిత బోధన ద్వారా ఆసక్తికరంగా పాఠాలు చెప్పాలని సూచించారు.ప్రాథమిక స్థాయిలోనే విద్యా ప్రమాణాలను బలోపేతం చేస్తే ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరిగి, ప్రభుత్వ విద్యకు మరింత ఆదరణ లభిస్తుందని కలెక్టర్ హైమావతి పేర్కొన్నారు.

# బాలలకు ఉచిత న్యాయ సేవలపై అవగాహన సదస్సు



కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): బాలల హక్కుల పరిరక్షణ, భద్రతతో పాటు వారికి అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు కరీంనగర్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పద్మనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్. శివకుమార్ అనుమతితో, ఇంచార్జి కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయమూర్తి కె. రాణి ఆదేశాల మేరకు బాలల న్యాయ సేవల విభాగం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. సభ్యులు, ప్యానెల్ న్యాయవాదులు ఏ. కిరణ్‌కుమార్, పెరుక రంగయ్యలు పాల్గొని పిల్లలకు చట్టం కల్పించిన హక్కులు, బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టం--2012, యాసిడ్ దాడుల బాధితులకు అందుబాటులో ఉన్న రక్షణపై వివరించారు.నల్సా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ చిల్డ్రన్ ద్వారా ప్రమాదంలో ఉన్న పిల్లలకు ఉచిత న్యాయ సహాయం, కౌన్సెలింగ్, రక్షణ, పునరావాసం అందుతున్నట్లు తెలిపారు. అలాగే మహిళలు, నిరుపేదలు, బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సలహాలు, లోక్ అదాలత్ ద్వారా వివాద పరిష్కార సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.పిల్లలపై ఎలాంటి హింస, వేధింపులు జరిగినా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా ఉచిత న్యాయ సేవల విభాగం 15100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి చిన్నారి హక్కులను పరిరక్షించడం కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్. వనజ, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, కరీమెద్దీన్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభమైన అన్నా అక్క మెంటార్‌షిప్ ఇంటర్న్‌షిప్




గంగాధర, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రుక్మాపూర్ గ్రామంలో అన్నా--అక్క మెంటార్‌షిప్ బోధనా ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ఐదవ సెమిస్టర్ జీవశాస్త్ర విద్యార్థులు రుక్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బోధన చేపట్టారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉన్నత విద్యా సంస్థల విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలిచి ఆధునిక విద్యా విధానాలను పరిచయం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా విద్యార్థులు పాఠశాల పిల్లలకు పాఠ్యాంశాలతో పాటు కృత్రిమ మేధ, డిజిటల్ విద్య, డిజిటల్ అక్షరాస్యతపై శిక్షణ ఇచ్చారు. చాట్‌జిపిటి, గూగుల్ జెమినీ, మైక్రోసాఫ్ట్ కోపైలట్ వంటి ఆధునిక కృత్రిమ మేధ సాధనాలను విద్యా .్యాసంలో ఎలా వినియోగించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ డా. మధు రాజేష్, ప్రొఫెసర్ తిరుకోవెల శ్రీనివాస్, డా. అంజనేయులు, డా. ఆర్. రాధాకృష్ణ, డా. తహేర్ హుస్సేన్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. గ్రామీణ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకునేలా ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు.పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు గట్టు శ్రీవాణి, ఉపాధ్యాయులు సంఘనపట్ల సురేందర్, మాధవరపు శరత్, సముద్రాల అంజయ్య, బండపల్లి మల్లికార్జున్, ఉదయ్, సి.ఆర్.పి. రమేష్ సురేందర్ కళాశాల బృందాన్ని అభినందించారు. ఈ శిక్షణ గ్రామీణ విద్యార్థుల భవిష్యత్ విద్యా ప్రగతికి బలమైన పునాది వేస్తుందని అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఐదవ సెమిస్టర్ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిల్లాలోని యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో 7,300 ఉద్యోగాల భర్తీ చేపడుతోందని, పెద్దపల్లి యువత ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు సాధించేలా ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి వసతి, భోజన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కోర్సులు రూపొందించి యువతను ఉద్యోగాలకు సిద్ధం చేయాలని, గ్రామీణ ప్రాంత యువతకు విస్తృత అవగాహన కల్పించేందుకు పంచాయతీ కార్యదర్శులను భాగస్వామ్యం చేయాలని ఆయన ఆదేశించారు. ఫాక్స్‌కాన్ వంటి సంస్థలు ఐటీఐ, ఏటీసీ విద్యార్థులను నియమించేందుకు ఆసక్తి చూపుతున్నందున వారికి ప్రత్యేక శిక్షణ అందించాలని, నర్సింగ్ విద్యార్థులకు టామ్‌కామ్ ద్వారా విదేశీ ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఎన్ఏసీ అకాడమీ అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి కోర్సులపై ప్రచారం చేసి యువతను ప్రోత్సహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో ఏఓ బి. ప్రకాష్, సీపీఓ జి. రవీందర్, ఉపాధి అధికారి రాజశేఖర్, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, టాస్క్ మేనేజర్ కౌసల్య, ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పన తదితర అధికారులు పాల్గొన్నారు.

# జైపాల్ రెడ్డి సేవలు దేశానికి మార్గదర్శకం

**- 7వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేతల ఘన నివాళి**



ఆమనగల్లు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి నిష్కళంక రాజకీయాలకు ప్రతీకగా నిలిచిన మాజీ కేంద్రమంత్రి దివంగత సూదిని జైపాల్ రెడ్డి సేవలు దేశానికి మార్గదర్శకమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం జైపాల్ రెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన నివాళి కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, డైరెక్టర్ వస్పుల శ్రీశైలం తదితరులతో కలిసి జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజాహితమే లక్ష్యంగా పనిచేసిన గొప్ప నాయకుడు జైపాల్ రెడ్డి అని కొనియాడారు. కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఆయన పోషించిన పాత్ర ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వస్పుల మానయ్య, సీనియర్ నాయకులు ధనుంజయ, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటరు హక్కు పరిరక్షణకు ఎస్ఐఆర్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి

**- కౌన్సిలర్ పాపిశెట్టి రాము**

**- 190వ బూత్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం**



ఆమనగల్లు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన ఓటరు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను సద్వినియోగం చేసుకుని ఓటరు జాబితాలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రముఖ సంఘసేవకులు, బీఆర్ఎస్ పార్టీ 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము పిలుపునిచ్చారు. ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు 190వ బూత్‌లో బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) స్వాతి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, పేర్లు, చిరునామా, ఇతర వివరాల్లో మార్పులు ఉన్నవారు వెంటనే సరిచేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితా పకడ్బందీగా ఉంటేనే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రతి కుటుంబం తమ ఓటరు వివరాలను ఒకసారి తప్పనిసరిగా పరిశీలించాలని, అర్హులైన ఒక్కరూ కూడా ఓటరు జాబితాకు దూరం కాకుండా చూడాలని సూచించారు. ప్రజలు బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించి ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ) జంతుక కిరణ్, చలి చీమల సతీష్, కోరే రవి, వస్పుల శ్రీరామ్, అనిల్, ఏకుల కార్తీక్, దార భరత్, గోరటి భరత్, లక్మల్ల శివ, లండం శివతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# అక్రమ కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

**– మున్సిపల్ అభివృద్ధికి వినియోగించాలని కౌన్సిలర్ల డిమాండ్**



**ఆమనగల్లు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ మున్సిపాలిటీ శివారులోని సంకటోనిపల్లి పరిధి సర్వే నంబర్–1027లో ఉన్న 4.06 గుంటల ప్రభుత్వ భూమి అక్రమ కబ్జాలో ఉందని, దానిని వెంటనే స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు వినియోగించాలని ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్లు మంగళవారం ఎంఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి తోటలు, పంటలు సాగు చేస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుని భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని వారు కోరారు. అనంతరం ఆ స్థలాన్ని పార్కు, కమ్యూనిటీ హాల్, పిల్లల ఆటస్థలం లేదా ఇతర మున్సిపల్ అభివృద్ధి పనులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి అక్రమ కబ్జాలపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ స్థలాలను అభివృద్ధి చేస్తే భవిష్యత్తులో ప్రజా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని కౌన్సిలర్లు అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ అంశంపై అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మున్సిపల్ కౌన్సిలర్లు ఎనుమల్ల రమేష్, ఎర్రవోలు మహేష్, మొక్తల వెంకటయ్య, నాగిళ్ల జగన్ పాల్గొన్నారు.

# రాష్ట్ర బాధ్యతలు చేపట్టిన కానుగుల దశరథంకు ఘన సన్మానం



**ఆమనగల్లు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర సమన్వయ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కానుగుల దశరథంకు ఆమనగల్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సంఘ సభ్యులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కానుగుల దశరథంకు లభించిన రాష్ట్ర స్థాయి బాధ్యత నాయి బ్రాహ్మణ సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో సంఘం మరింత బలోపేతం కావడంతో పాటు నాయి బ్రాహ్మణుల సంక్షేమం, ఐక్యత, సామాజిక అభ్యున్నతి, వృత్తి అభివృద్ధికి విశేష కృషి జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సభ్యుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు యువతకు ప్రోత్సాహం, సంక్షేమ పథకాల అమలులో సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు. కానుగుల దశరథం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర బాధ్యతలు అప్పగించిన సంఘ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో నాయి బ్రాహ్మణ సేవా సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు సభ్యుల సంక్షేమం, ఐక్యత కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. సమాజ అభివృద్ధి కోసం అందరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మండల అధ్యక్షుడు కానుగుల గణేష్, పట్టణ అధ్యక్షుడు దేవరకొండ రమేష్, గౌరవ అధ్యక్షుడు పెరికేటి యాదయ్య, జంపుల యాదగిరి, దేవరకొండ నాగేష్, పెరికేటి కోటయ్య, బాలు, రామచంద్రయ్య, వెంకటేష్, శేఖర్, దీపు, లక్ష్మణ్, శివ, రాములు తదితరులు పాల్గొని కానుగుల దశరథంకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.

# ఓటరు జాబితా సవరణలో బీఎల్ఏ-2లే కీలకం

**– ఎస్ఐఆర్ మండల ప్రవాస్ అభియాన్‌లో దండు శ్రీనివాస్ గౌడ్**



**ఆమనగల్లు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ మండలం, మున్సిపాలిటీ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) మండల ప్రవాస్ అభియాన్‌లో భాగంగా బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి అధ్యక్షతన బీఎల్ఏ-2ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి దండు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా పూర్తి చేయడంలో బీఎల్ఏ-2ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను ధ్రువీకరించడం, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలను గుర్తించి సంబంధిత బీఎల్ఓలకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా అమలు చేస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. అనంతరం 185, 186, 187, 188, 189 బూత్‌లకు చెందిన బీఎల్ఏ-2లు, శక్తి కేంద్ర ఇన్‌చార్జి చెక్కల లక్ష్మణ్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశం, భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేరంగుల పెద్దయ్య, సందీప్, చెన్నకేశవులు, కళ్యాణ్‌లతో ప్రత్యేకంగా మాట్లాడిన దండు శ్రీనివాస్ గౌడ్ ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఇంటింటి సర్వే, దరఖాస్తుల స్వీకరణ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోలేటి నరసింహాతో పాటు బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి మహోత్సవాలకు సర్వం సిద్ధం

**– శ్రీ షిరిడి సాయిబాబా సేవాసంస్థ ఆధ్వర్యంలో నేడు వైభవంగా వేడుకలు**



**ఆమనగల్లు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా సేవాసంస్థ ఆధ్వర్యంలో బుధవారం (జూలై 29) గురుపౌర్ణమి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీ షిరిడి సాయినాథుని ఆలయంలో రోజంతా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సామూహిక హోమం, భజనలు, పల్లకీ సేవ, మహా హారతులు, తీర్థప్రసాదం, అన్నప్రసాద వితరణతో ఆధ్యాత్మిక వాతావరణంలో వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమై, 7 గంటలకు శ్రీ సాయినాథునికి మంగళస్నానం, 8 నుంచి 9 గంటల వరకు సంస్థాన్‌వారి హారతి, ప్రత్యేక అర్చనలు, ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శ్రీ సాయి సామూహిక ప్రత్యేక హోమం, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం మహా హారతి అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టనుండగా, సాయంత్రం ధూప హారతి, పల్లకీ సేవ, రాత్రి శేజ్ హారతితో మహోత్సవాలు ముగియనున్నాయి. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పూజల్లో పాల్గొన దలచిన భక్తులు గోత్రనామాలు నమోదు చేసుకుని కుటుంబ సమేతంగా హాజరై శ్రీ సాయినాథుని ఆశీస్సులు పొందాలని కోరారు. మహోత్సవాల సందర్భంగా భక్తులందరికీ తీర్థప్రసాదం, అన్నప్రసాదం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గురుపౌర్ణమి వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# ఓటు హక్కును కాపాడుకోండి

**– పెండింగ్ ఓటర్లు వెంటనే నమోదు ఫారాలు సమర్పించాలి**
**– రాజకీయ పార్టీలతో సమన్వయ సమావేశంలో అధికారుల సూచన**



**ఆమనగల్లు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్–2026) ప్రక్రియను వేగవంతం చేసేందుకు మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్ఓ) మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఓటర్ల నమోదు, పరిశీలన ప్రక్రియ పురోగతిని సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 16,967 మంది ఓటర్లలో ఇప్పటివరకు 88.07 శాతం నమోదు ప్రక్రియ పూర్తయిందని, ఇంకా సుమారు 2,000 మంది ఓటర్లు తమ నమోదు ఫారాలను సమర్పించాల్సి ఉందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, డూప్లికేట్ ఓటర్లు, మరణించిన వారు, చిరునామాలో లేని లేదా ఆచూకీ లభించని ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. నమోదు ఫారాలు సమర్పించని వారు, అవసరమైన వివరాలు అందించని వారి పేర్లు నిబంధనల మేరకు ఓటరు జాబితా నుంచి తొలగించబడే అవకాశం ఉందని కమిషనర్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వారీగా పెండింగ్‌లో ఉన్న ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసి, ప్రతి అర్హుడైన ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు బోగస్, డూప్లికేట్ ఓట్లను పూర్తిగా తొలగించాలని కోరగా, ఏఈఆర్ఓ స్పందిస్తూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పూర్తి పారదర్శకంగా పరిశీలన నిర్వహించి బోగస్ ఓట్ల వివరాలను ప్రక్రియను పక్కాగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి ఓటరు ఈ శనివారం లోగా నమోదు ఫారాలను సమర్పించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము, నాయకులు సయ్యద్ ఖలీల్, నిరంజన్ గౌడ్, అనంతుల సైదులు గౌడ్, వడ్డేమాని శివకుమార్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల దర్శనంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అచ్చంపేట, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటిగా, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీశైల మహాక్షేత్రంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, రాష్ట్ర ఎస్సీ--ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భక్తి శ్రద్ధలతో దర్శనం చేసుక న్నారు. ఉదయం ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి, ఎమ్మెల్యేలకు శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎం. శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు శ్రీ మల్లికార్జున స్వామి, శ్రీ భ్రమరాంబ అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట మార్కెట్ చైర్మన్ రజిత మల్లేష్, రాష్ట్ర నాయకులు కుంద మల్లికార్జున్, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల రాజగోపాల్, కాశన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటలు అందుబాటులో ప్రసూతి, చిన్నపిల్లల వైద్య సేవలు



**పెద్దపల్లి, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి జిల్లా మంథని సిహెచ్‌సీకి ఇటీవల ముగ్గురు నిపుణ వైద్యులు నియమితులయ్యారు. డాక్టర్ మామిడిపల్లి ప్రవంతి గైనకాలజిస్ట్‌గా, డాక్టర్ గుంట మౌనిక అనస్తీషియా నిపుణురాలిగా, డాక్టర్ నరేష్ చిన్నపిల్లల వైద్య నిపుణుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నియామకాలతో ఇకపై మంథని సిహెచ్‌సీలో 24 గంటల పాటు ప్రసూతి సేవలు, చిన్నపిల్లల వైద్య సేవలు నిరంతరాయంగా అందుబాటులో ఉంటాయని జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ తెలిపారు. ప్రజలు ఈ మెరుగైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన, ఉచిత వైద్య సేవలను పొందాలని ఆయన కోరారు.

# రాధాకృష్ణుల శోభాయాత్రకు చింతల రవికుమార్ కు ఆహ్వానం



**ఎల్బీనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఈ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు వనస్థలిపురంలోని హైకోర్ట్ కాలనీ నుండి గురుద్వారా పక్కన ఉన్న శ్రీ రామాలయం వరకు జరగనున్న శ్రీ సీతారామ స్వామి మరియు శ్రీ రాధాకృష్ణుల మహా నగర శోభాయాత్ర ఓ సంకీర్తన కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ను నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, "రాధాకృష్ణుల రథయాత్ర భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రతీక. సనాతన ధర్మ పరిరక్షణ, భక్తి భావాన్ని పెంపొందించే ఈ పవిత్ర శోభాయాత్రలో భక్తులందరూ కుటుంబ సమేతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి" అని కోరారు. ఈ శోభాయాత్రలో భక్తులు, ప్రజా ప్రతినిధులు, సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.

# ఐదు ఉద్యోగాలు సాధించిన అంజన్ కుమార్‌కు ఘన సన్మానం



**ఇబ్రహీంపట్నం, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఒకేసారి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన చిందం అంజన్ కుమార్ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. అంజన్ కుమార్, చిందం సుగుణమ్మ--కృష్ణయ్యల కుమారుడు, ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని తెలంగాణ గ్రామీణ బ్యాంకు క్లర్క్, హైకోర్టు ఫీల్డ్ అసిస్టెంట్, రెండు రైల్వే ఎన్టీపీసీ ఉద్యోగాలు, టీజీఆర్టీసీ సూపరింటెండెంట్ ఇలా ఒకేసారి ఐదు ఉద్యోగాలు సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, "నేటి యువత అంజన్ కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలి. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని నిర్విరామంగా కృషి చేస్తే జీవితంలో విజయాలు సాధించవచ్చు" అని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, వస్పరి కుమార్, ఎండి అశ్రఫ్, కోరె పాండు తదితరులు పాల్గొన్నారు.

# మర్రిగూడ బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన సదస్సు



**మర్రిగూడ, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రయాణికుల భద్రతా రక్షణ కోసం మర్రిగూడ మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు తమ సామాను, విలువైన వస్తువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని, అపరిచిత వ్యక్తులను నమ్మరాదని సూచించారు. తొందరపాటు వలన ఆటోలు, బస్సుల్లో ఆభరణాలు లేదా డబ్బులు మరిచిపోయినచో వాటిని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. అలాగే గంజాయి, ఇతర మత్తు పదార్థాలతో ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హెచ్చరించారు. సైబర్ క్రైమ్ అవగాహనలో భాగంగా ఏపీకే ఫైల్స్ ద్వారా జరిగే మోసాలపై యువతకు వివరించారు. ఈ కార్యక్రమంలో జమిందార్ ప్రదీప్, కానిస్టేబుల్లు కిషన్, సత్యనారాయణతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సేవ రత్న పురస్కారం అందుకున్న బండ జగన్



**హైదరాబాద్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్లోబల్ ఫైన్ ఆర్ట్స్ ఓ యోగ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో, మల్లెపుల్ల వెంకటరమణ సమన్వయంతో మంగళవారం జరిగిన "సేవ ప్రపూర్ణ పురస్కారం--2026" కార్యక్రమంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని సత్కరించారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ ప్రభుత్వ దివ్యాంగుల ఉద్యోగ సంఘం అధ్యక్షుడు, ఉజ్వల ఫౌండేషన్ చైర్మన్ బండ జగన్ను ప్రముఖులు దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక సేవ రత్న పురస్కారం అందజేశారు. అవార్డు స్వీకరించిన బండ జగన్ మాట్లాడుతూ, "ఈ పురస్కారం నా సేవా భావాన్ని మరింత పెంచింది. దివ్యాంగులు, నిరుపేదలకు 'బండ ఉజ్వల ఫౌండేషన్' తరపున విశిష్ట సేవలు అందిస్తాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లెపుల్ల వెంకటరమణ, దైవజ్ఞ శర్మ, టెలు విజయ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యంగుడి కోరికను తీర్చిన మల్కాజ్గిరి సీపీ సుమతి



మేడ్చల్--మల్కాజ్గిరి, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):దమ్మాయిగూడకు చెందిన తిరుమలరావు--రాధమ్మ దంపతుల పెద్ద కుమారుడు రాహుల్ పుట్టుకతోనే దివ్యాంగుడిగా జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణ కూడా ఇబ్బందికరంగా మారిన ఈ పరిస్థితిని గమనించిన ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ రస్మిత, తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ ఆధ్వర్యంలో రాహుల్‌కు వీల్‌చైర్ అందజేశారు.రాహుల్‌ను ఎవరైనా "పెద్దయ్యాక ఏమవుతావు?" అని అడిగితే "పోలీస్ అవుతాను" అని చెప్పడం మల్కాజ్గిరి సీపీ సుమతి దృష్టికి వచ్చింది. వెంటనే ఆమె రాహుల్‌ను తన కార్యాలయానికి పిలిపించి, ఎస్‌హెచ్‌ఓ కుర్చీలో కూర్చోబెట్టి, తన టోపీని రాహుల్ తలపై పెట్టి "ఇప్పుడు హ్యాపీగా ఉన్నావా?" అని అడిగారు. రాహుల్ ముసిముసి నవ్వు నవ్వుతుండగా, అక్కడ ఉన్నవారు చప్పట్లతో సీపీ గొప్ప మనసును ప్రశంసించారు.

## ప్రాణదానానికి 25 మంది యువత ముందుకు



ఆమనగల్లు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మానవతా సేవకు మరోసారి నిదర్శనంగా లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ సహకారంతో లయన్ అంజి రెడ్డి ఆధ్వర్యంలో లింగారావుపల్లిలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఘన విజయాన్ని సాధించింది. కెనరా బ్యాంక్ మేనేజర్ కిరణ్ కుమార్ రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ కార్యదర్శి లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి సంయుక్తంగా శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 25 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. 150 సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఎందరికో ప్రాణదాతగా నిలిచిన లయన్ అంజి రెడ్డి సేవలు అభినందనీయమని అన్నారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ "రక్తం దానం... ప్రాణానికి ప్రాణం" అని పేర్కొన్నారు. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, అత్యవసర పరిస్థితుల్లో స్వచ్ఛంద రక్తదాతలే ప్రాణాలను కాపాడగలరని తెలిపారు. ప్రతి ఆరోగ్యవంతుడు మూడు నెలలకు ఒకసారి స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా సేవలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. రక్తదానం ద్వారా అనేక మంది జీవితాల్లో కొత్త ఆశలు నింపవచ్చని, యువత పెద్ద ఎత్తున ఈ మహోన్నత సేవలో భాగస్వాములు కావాలని వక్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్ రవీందర్ రెడ్డి, వివిధ యువజన సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమ వివరాలను పి.ఆర్.ఓ. పాషా వెల్లడించారు.

## రాజపేట తండా ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



మర్రిగూడ, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మర్రిగూడ మండల కేంద్రంలో రాజపేట తండా గ్రామపంచాయతీ రెవెన్యూ పరిధిలో ఉన్న 281 సర్వే నంబర్లలో 10 ఎకరాల ప్రభుత్వ భూమిను కాపాడాలని గ్రామ ప్రజలు, వార్డు మెంబర్లు, బీసీ సంఘం నాయకులు మండల తహసిలాద్రర్‌కు వినతిపత్రం అందజేశారు.ఆ భూమిలో ఇప్పటికే మండల తహసిల్దార్ కార్యాలయం, పాఠశాలలు, కస్తూర్బా హాస్టల్ నిర్మించబడింది. అదేవిధంగా పేద ప్రజలకు ఇండ్ల స్థల పట్టాలు కూడా మంజూరయ్యాయి. అయితే కొంతమంది రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు కలిసి ఆ భూమి పక్కన ఉన్న వెంచర్‌లో ప్రభుత్వ భూమిని రహదారిగా మార్చుకుని కబ్జా చేస్తున్నారని గ్రామ ప్రజలు ఆరోపించారు. పేదలు, గిరిజనులు, దళితులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను కూడా ఆక్రమిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి ఆ రహదారిని నిలిపివేసి ప్రభుత్వ భూమిని కాపాడాలి" అని గ్రామ ప్రజలు, వార్డు మెంబర్లు కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు పచ్చిపాల రాజు, కొర్ర ఆంమోస్, రామావత్ రాజు నాయక్, నేనావత్ నరేష్, బీసీ సంఘం యూత్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మారగోని సుధీర్ కుమార్, గిరిజన నాయకుడు ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లోరింగ్ నిర్మూలన భూగర్భ జలాల పెంపే లక్ష్యం



మర్రిగూడ, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మర్రిగూడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం 18 గ్రామపంచాయతీ సర్పంచులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ, "ఫ్లోరింగ్ నిర్మూలన ద్వారా భూగర్భ జలాల పెంపే ప్రధాన లక్ష్యం" అని పేర్కొన్నారు.సమావేశంలో తెలంగాణ జలసిరి, జలసంచాయి జెన్ భాగిదారి పనులపై సమీక్ష జరిగింది. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట నిర్మాణం ద్వారా నీటి సంరక్షణను విస్తృతంగా అమలు చేయాలని ఆయన సూచించారు. ఆగస్టు 15 నాటికి నీటి భద్రత పనులు పూర్తి కావాలని ఆదేశించారు.జులై 1 నుండి అమలులోకి వచ్చిన వివిజి రాంజీ చట్టం కింద పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. "ప్రతి ఇంటికి ఇంకుడు గుంత -- ప్రతి పొలానికి పంట కుంట -- ప్రతి ఊరికి ఊట కుంట" అనే నినాదంతో గ్రామాల్లో నీటి సంరక్షణ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ పథకం విజయవంతం కావడానికి జులై 29న మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో అత్యవసర గ్రామసభలు నిర్వహించాలని గ్రామ కార్యదర్శులు, సర్పంచులకు ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ పనులను గుర్తించి తీర్మానాలు చేయాలని, వాటిని గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలో పొందుపరచాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి మున్నయ్య, ఎంపీఓ రవికుమార్, వ్యవసాయ అధికారి విద్యాసాగర్, సహ--ఏపీఓ జయరాజు, మిషన్ భగీరథ ఏఈ వెంకటేష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రభాకర్, ఐకెపి ఎపిఎం వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి నిలయం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



వెల్దండ, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): వెల్దండ మండల పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, కల్వకుర్తి విద్యార్థులు సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో ఇటీవల జరిగిన కార్గిల్ విజయ్ దివస్ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన గ్రూప్ పాటల పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించారు.విజేతలకు రాష్ట్రపతి నిలయం ఎస్టేట్ మేనేజర్ డా. కె. రజిని ప్రియ, టీఏఎస్ఏ ప్రధాన కార్యాలయ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ జి. శ్రీనివాస్, వీఎస్ఎం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సుమన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కోడం భాస్కర్ విద్యార్థులను అభినందించారు. వారి విజయానికి కృషి చేసిన సంగీత ఉపాధ్యాయులు సోను, మోసెస్లను ప్రత్యేక ంగా ప్రశంసించారు. ఉపాధ్యాయులు రీనా, అనిల్, అనీషా, రాహుల్తో పాటు విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.రాష్ట్రపతి నిలయం వంటి ప్రతిష్ఠాత్మక వేదికపై ఏకలవ్య కల్వకుర్తి విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించడం పాఠశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్,
వైస్ ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

## పెండింగ్ స్కాలర్షిప్ లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్




దేవరకొండ, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. మీనాక్షి సెంటర్ నుండి కోర్టు మీదుగా బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకు నినాదాలతో చేరుకొని మానవహారం నిర్వహించి రోడ్డు రవాణాను స్తంభింపజేశారు.ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, "ప్రభుత్వం విద్యార్థుల పట్ల కక్షపూరితమైన ఆలోచన లేకుండా మొండి వైఖరిని వీడి పెండింగ్లో ఉన్న 10,500 కోట్ల స్కాలర్షిప్ లను, ఫీజు రీయింబర్స్మెంట్ ను తక్షణమే విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు. చదువు పూర్తయినా ఇంజనీరింగ్, ఇతర కళాశాలల విద్యార్థులు పెండింగ్ బకాయిలు విడుదల కాకపోవడం వల్ల సర్టిఫికెట్లు పొందలేక పై చదువులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ప్రభుత్వం దశలవారీగా ఎత్తివేయాలని కుట్ర చేస్తోందని, గత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసి విద్యార్థులను ప్రోత్సహించిందని గుర్తుచేశారు. "ప్రస్తుత ప్రభుత్వం బహుజన విద్యార్థుల భవిష్యత్తును అణచివేసే కుట్ర చేస్తోంది. ఇదే విధంగా కొనసాగితే ప్రభుత్వాన్ని గద్దె దించుతాం" అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, డాక్టర్ సొల్లేటి భాస్కరాచారి, పున్న బిక్షమయ్య, కుంభం బాలచందర్ గౌడ్, పల్స శ్రీనివాస్ గౌడ్, మొర వెంకటయ్య యాదవ్, మాదారం గణేష్, మాదారం గౌతం, లావణ్య, రోజా, రమేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి కలెక్టర్



నల్లగొండ, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): దోమలపల్లి రైతు వేదికలో జరిగిన "రైతు నేస్తం 100వ ఎపిసోడ్" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటల వైపు వెళ్లాలని సూచించారు.అల్పపీడన ద్రోణి ప్రభావంతో వర్షాభావం కొనసాగుతుందని, శ్రీశైలం--నాగార్జునసాగర్ ప్రాజెక్టులు నిండే అవకాశం లేదని ఆయన తెలిపారు. ఇప్పటికే పత్తి, కంది పంటలు వేసుకున్న వారు అంతర పంటలు వేసుకోవచ్చని, సజ్జలు, సామలు, కొర్రలు వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వం సబ్సిడీపై బిందు పరికరాలు అందజేస్తుందని వివరించారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, "రైతు నేస్తం ద్వారా వాతావరణ పరిస్థితులు, సాగు పద్ధతులు, ఎరువులు, నూతన విషయాలు రైతులకు చేరుతున్నాయి. ఎల్ నినో ప్రభావం దృష్ట్యా ఉద్యాన పంటలు, ఆరుతడి పంటల వైపు రైతులు వెళ్లాలి" అని అన్నారు.

## బంజారా వైభవం.. సీత్లా పండుగ

**- చంద్రాయన్‌పల్లి తండాలో ఘనంగా నిర్వహణ**



ఆమనగల్లు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయన్‌పల్లి తండాలో మంగళవారం సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో బంజారా జాతి ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించే సీత్లా పండుగ మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తండావాసులు సంప్రదాయ బంజారా వస్త్రధారణలో పాల్గొని సీత్లా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిగీతాలు, సంప్రదాయ కార్యక్రమాలతో తండా ఆధ్యాత్మిక, సాంస్కృతిక శోభతో కళకళలాడింది. ఈ వేడుకలకు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ బంజారా జాతి సంస్కృతి, సంప్రదాయాలు తెలంగాణ సాంస్కృతిక వారసత్వంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయని, వాటిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజంలో ఐక్యత, సేవాభావం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. బంజారా సమాజం తమ సంప్రదాయాలను కాపాడుకుంటూ ఇలాంటి వేడుకలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం సేవాలాల్ సంఘం ప్రతినిధులు అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాటవత్ పంతు నాయక్, గోపాల్, రమేష్, వశ్య, శ్రీకాంత్, రాములు, లష్కర్, లక్య, సక్కు స్వామి, సేవాలాల్ సంఘం సభ్యులు, తండా పెద్దలు, మహిళలు, యువకులు
తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల వేధింపులపై మంత్రికి ఫిర్యాదు

**- విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకుంటాం**

**- మంత్రి దామోదర రాజనర్సింహ**



ఆమనగల్లు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులపై జరుగుతున్న వేధింపులు, అధికార దుర్వినియోగంపై తెలంగాణ ఎన్‌జీఓ (ంచీ+ూ) రాష్ట్ర నాయకులు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ దామోదర రాజనర్సింహను కలిసి మంగళవారం ఫిర్యాదు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కొందరు అధికారులు అధికారాన్ని స్వార్థ ప్రయోజనాలకు వినియోగిస్తూ నిజాయితీగా పనిచేసే ఉద్యోగులను బదిలీలు, మెమోలు, పరిపాలనా ఒత్తిళ్లతో వేధిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే విచారణ పేరుతో సమస్యలను కాలయాపన చేస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వ వైద్య సేవలు, సంక్షేమ పథకాల అమలుపైనా ప్రతికూల ప్రభావం పడుతోందని వివరించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. ముజీబ్ హుసేని, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు యశ్వంత్, జిల్లా కార్యదర్శి మెంగా శ్రీనివాస్‌తో పాటు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. ఉద్యోగుల వినతిని శ్రద్ధగా విన్న మంత్రి డాక్టర్ దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, విచారణ నివేదికను వెంటనే తెప్పించి వాస్తవాలను పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఉద్యోగులను వేధించే వారిని ఉపేక్షించబోమని హామీ ఇచ్చారు. దీంతో ప్రభుత్వం సమస్యపై సానుకూలంగా స్పందించిందని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి, యువత పోరాట విజయం



తిప్పర్తి, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థి--యువజన ఉద్యమాల విజయమని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లం మహేష్ పేర్కొన్నారు. నల్గొండ జిల్లా తిప్పర్తి మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీట్‌తో పాటు జాతీయ స్థాయి పరీక్షల్లో జరిగిన పేపర్ లీక్‌లు, అవకతవకల కారణంగా లక్షలాది విద్యార్థులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని అన్నారు. ఈ ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి రాజీనామా చేయడం విద్యార్థి--యువజన పోరాటాల ఫలితమని పేర్కొన్నా .దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్య శక్తులు చేపట్టిన నిరంతర ఉద్యమాలే ఈ విజయానికి కారణమని ఆయన అన్నారు. ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా పారదర్శక పరీక్షా విధానాలు అమలు చేయాలని, విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలు అవసరమని డిమాండ్ చేశారు.భవిష్యత్తులో కూడా విద్యార్థి--యువజన సమస్యల పరిష్కారం కోసం డివైఎఫ్ఐ నిరంతర పోరాటాలు కొనసాగిస్తుందని మల్లం మహేష్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి పోకల శశిధర్, మండల అధ్యక్షులు లింగరాజు, శంకర్, శివ,
పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పీఎస్ డ్రంకెన్ డ్రైవ్ కేసుల విచారణపై సీపీ గౌష్ ఆలం వివరణ



కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన అంతర్గత విచారణలో అవినీతి వెలుగులోకి వచ్చింది. మే 19న పద్మనగర్‌కు చెందిన బేతి రాజేందర్ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడినప్పటికీ, కోర్టుకు హాజరుకాకుండానే కేసు డిస్పోజ్ అయినట్లు తేలింది. ఈ కేసులో ఆర్ఎస్సై శనిగల శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ సాయి కృష్ణ, డీడీ డిస్పోసల్ స్టేషన్ కానిస్టేబుల్ కిరణ్‌లు నిందితుడి నుండి రూ.15 వేల లంచం తీసుకుని డూప్లికేట్ కేసు నంబర్ నమోదు చేసి అక్రమంగా కేసును ముగించినట్లు ఆధారాలు బయటపడ్డాయి.సీపీ గౌష్ ఆలం నివేదిక ఆధారంగా ముగ్గురిపై డీఐజీ ఇప్పటికే సస్పెన్షన్ వేటు వేశారని తెలిపారు. 2025 జనవరి నుండి 2026 జూన్ 30 వరకు నమోదైన డ్రంకెన్ డ్రైవ్ కేసులపై సమగ్ర విచారణ జరుగుతోందని, ఇప్పటివరకు 113 కేసుల్లో డూప్లికేట్ లేదా రిపీటెడ్ ఎస్టీసీ నంబర్లు గుర్తించామని చెప్పారు. వాటిలో 13 కేసుల్లో అవినీతి జరిగినట్లు తేలింది. మూడు కేసుల్లో నిందితులు కోర్టుకు హాజరుకాకుండానే జరిమానా చెల్లించినట్లు చూపించి తప్పుగా డిస్పోజ్ చేశారు. మరో 10 కేసుల్లో కోర్టు విధించిన జరిమానా కంటే అదనంగా రూ.9,700 లంచంగా వసూలు చేసినట్లు విచారణలో బయటపడింది. మొత్తంగా 14 కేసుల్లో రూ.34,700 మేర అవినీతి జరిగినట్లు తేలిందని, మీడియాలో వస్తున్నట్లు రూ.30 లక్షల అవినీతి జరిగిందనే వార్తల్లో వాస్తవం లేదని సీపీ స్పష్టం చేశారు.సీపీ గౌష్ ఆలం వాహనదారులకు విజ్ఞప్తి చేస్తూ, డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారు కోర్టులో హాజరై జరిమానా నేరుగా కోర్టు సిబ్బందికే చెల్లించాలని, రశీదును పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని సూచించారు. ఎవరైనా పోలీసులు అదనపు డబ్బులు డిమాండ్ చేసినా లేదా కోర్టులో హాజరు పరచకుండా కేసులను డిస్పోజ్ చేస్తామని చెప్పినా వెంటనే సీపీ కార్యాలయం లేదా ఏసీబీ కార్యాలయానికి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ట్యాంకర్లతో నీటిని తెచ్చుకొని పంట సాగు



**నందికొట్కూరు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాకాలం రెండు నెలలు గడిచినా వరుణుడు కరుణించక రైతు కష్టాలు వర్ణాంతరంగా మారాయి. నందికొట్కూరు మండలంలోని శాతనకోట గ్రామానికి చెందిన జక్కుల రాఘవేంద్ర ఒక ఎకరా భూమిని రూ.24 వేల కౌలుకు తీసుకొని పంట సాగు ప్రారంభించారు.పంట పెట్టుబడికి అప్పులు చేసి సాగు మొదలుపెట్టిన ఆయనకు సకాలంలో వర్షం కురవకపోవడంతో పంట ఎండిపోవడం ప్రారంభమైంది. కనీసం కౌలు కట్టేందుకు అయినా పంటను కాపాడుకోవాలని సంకల్పించి ట్రాక్టర్లలో నీటి ట్యాంకర్లను తెప్పించి పొలాలకు నీరు పోసి సాగు కొనసాగిస్తున్నారు.రాఘవేంద్ర మాట్లాడుతూ, “వరుణుడు కరుణిస్తే అప్పులు తీర్చుకొని కుటుంబ జీవనం నిలదొక్కుకోవచ్చు. లేకపోతే కౌలు రైతు జీవితం మరింత కష్టాల్లో పడుతుంది” అని ఆవేదన వ్యక్తం చేశారు.

## చెరువుగట్టు అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం



**నల్లగొండ, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చెరువుగట్టు దేవస్థానం వద్ద ఇటీవల షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో ఉపాధి కోల్పోయిన షాప్ యజమానులకు ప్రజా హక్కుల సాధన సమితి ఆర్థిక సహాయం అందించింది.సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుగమల్ల షాలెమ్ రాజు బాధితులకు రైస్ బ్యాగులు, నగదు సహాయం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, “ఈ ప్రమాదంలో 17 షాపులు దగ్ధమై, సుమారు రూ.3 కోట్ల ఆస్తి నష్టం జరిగింది. ప్రభుత్వం వెంటనే ముందుకు వచ్చి నష్టపరిహారం చెల్లించాలి” అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ కలకుంట్ల వినోద్ చారి, అంగోతు కార్తీక్, శంకరయ్య, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## శోభాయాత్రకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలి శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి



**కల్వకుర్తి, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్లో జరుగుతున్న శ్రీకృష్ణ కాలచక్రం శ్రీ సీతారామస్వామి పట్టాభిషేకం 91వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం 4:30 గంటలకు యాగ జేత్ర యాత్ర ప్రారంభం కానుంది. యాగశాల నుండి సుమారు 5000 మంది భక్తులతో శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు యాగ నిర్వాహకులు శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి తెలిపారు. ఈ పవిత్ర యాత్రలో పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి పాల్గొని ఆధ్యాత్మిక శోభను పెంచాలని ఆయన పిలుపునిచ్చారు.

## నాటుసారా స్థావరాలపై అబ్కారీ శాఖ దాడులు నాలుగు కేసులు నమోదు



**దేవరకొండ జూలై 28.(నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** నల్లగొండ డిపిఈఓఆదేశాల మేరకు దేవరకొండ ఎస్ హెచ్ ఓ నల్గొండ ఎస్ హెచ్ ఓ మరియు నాంపల్లి తో కలిసి దేవరకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని మేగ్యాతండ, పన్ని తండా, అంగోతుతండ, కేశ్యా తండా, మర్రిచెట్టు తండా లలో నాటు సారా తయారు చేసే స్థావరాలపై దాడులు చేశారు. ఈ దాడిలో 4లీటర్ల సారాయి, 180కిలోల నల్లబెల్లం,40కిలోల పట్టిక, స్వాధీనం చేసుకున్నారు మరియు 600 లీటర్ల జెఫ్ వాష్ ధ్వంసం చేశారు ముగ్గురు వ్యక్తులపై బైండవర్ కేసు, నమోదు చేసినట్లు దేవరకొండ ఎస్. ఎచ్ .ఓ తెలిపారు.

## జైపాల్ రెడ్డికి నివాళులర్పించిన తల్లోజు ఆచారి



**కల్వకుర్తి, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత జైపాల్ రెడ్డి రాజకీయ విలువలకు కట్టుబడి, కల్వకుర్తి ప్రాంతానికి ముద్దుబిడ్డగా నిలిచారని బీజేపీ జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు.మంగళవారం హైదరాబాద్‌లో జైపాల్ రెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. “జైపాల్ రెడ్డి చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయి” అని తల్లోజు ఆచారి పేర్కొన్నారు.

## అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట



**నందికొట్కూరు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు మండలం వడ్డెమాను గ్రామంలో జరిగిన “రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం” కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు.మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి లక్ష్యాలను ప్రజలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సత్యం రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, రామచంద్రయ్య, గజేంద్ర, దిలీప్ కుమార్ నాయుడు, ముత్తు, నవీన్ కుమార్ రెడ్డి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గిత్త



**నందికొట్కూరు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు “ఇంటింటికి తెలుగుదేశం” కార్యక్రమం నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడు బంగ్లా మండలం బన్నూరు గ్రామంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య గ్రామ ప్రజలతో కలిసి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రతి గడపకు, ప్రతి కుటుంబానికి వెళ్లి భరోసా కల్పించారు.గ్రామంలో ఉన్న డ్రైనేజ్ సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, ఇళ్ల పట్టాల సమస్యలు గురించి ప్రజలు తెలియజేయగా, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం మండల నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## దామగట్లలో “పొలం పిలుస్తుంది” కార్యక్రమం



**నందికొట్కూరు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో “పొలం పిలుస్తుంది” కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి పి. షేక్ షావలి రైతు సేవా కేంద్ర సిబ్బందితో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా పంటల క్రాప్ కండిషన్, క్రాప్ సిచువేషన్ పై రైతులతో చర్చించారు. ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ విధానం వివరించారు. అలాగే వాతావరణ బీమా మరియు ప్రధా మంత్రి ఫసల్ బీమా పథకాలపై అవగాహన కల్పించారు.ఈ నెల 30వ తేదీ వాతావరణ బీమా, 31వ తేదీ ప్రధానమంత్రి ఫసల్ బీమా చివరి తేదీగా ఉన్నందున రైతులందరూ తప్పనిసరిగా క్రాప్ ఇన్సూరెన్స్ కట్టుకోవాలని అధికారులు సూచించారు.

## మంత్రి నారా లోకేష్‌ను కలిసిన మాండ్రా శివానందరెడ్డి



**నందికొట్కూరు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ను విజయవాడలో నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్రా శివానందరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నందికొట్కూరు నియోజకవర్గ సమస్యలపై చర్చించి, స్థానిక అభివృద్ధి అంశాలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై, పార్టీ అభివృద్ధి కార్యక్రమాలపై, రాబోయే స్థానిక ఎన్నికల్లో టిడిపి విజయంపై కూడా చర్చించారు.

## టిడిపి ఇంటింటికి ప్రచారంలో పాణ్యం ఎమ్మెల్యే



**గడివేముల, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గడివేముల మండలం గడిగారేవుల గ్రామంలో ఘనంగా “డోర్ టు డోర్ -- ఇంటింటికీ ప్రచారం” కార్యక్రమం ప్రారంభమైంది.కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌరు చరిత, వంగా శ్రీనివాస్ రెడ్డి, సత్యం రెడ్డి, పాణ్యం మార్కెట్ చైర్మన్ అంగజాలా కృష్ణుడు, మండల కన్వీనర్ దిలీప్ రెడ్డి పాల్గొన్నారు.టీడీపీ పార్టీ కార్యాలయ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గురించి ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి సీనియర్ నాయకుడు రాచమళ్ళ శ్రీనివాసులు, నగిరి వెంకటేశ్వర్లు, మిద్దె పరమేష్ నాయుడు, మిద్దె శ్రీను, మోతుకూరు శ్రీను, నగిరి వెంకటరమణ, ఆర్. శివ శంకర్, సిద్దెం రఘు, సిద్దెం శ్రీను, ఆర్. రామకృష్ణుడు, సిద్దెం ప్రసాద్, కుమ్మరి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల చేతిలో మున్సిపల్ అధికారి




**ఆత్మకూరు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో సైబర్ నేరగాళ్లు హల్‌చల్ చేసిన ఘటన కలకలం రేపుతోంది.కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారిని లక్ష్యంగా చేసుకుని, ఏసీబీ డీఎస్పీ పేరుతో ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి అవినీతి ఆరోపణలు ఉన్నాయని భయపెట్టాడు. ఈ వ్యవహారాన్ని బయటకు రాకుండా చూస్తానంటూ భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేశాడు.నిజమైన కాల్ అని నమ్మిన అధికారి, సైబర్ నేరగాడు చెప్పిన నంబర్‌కు ఫోన్ పే ద్వారా రూ.95 వేల రూపాయలు పంపినట్లు సమాచారం. అనంతరం తాను మోసపోయానని గ్రహించి షాక్‌కు గురైన ఆయన, పరువు పోతుందన్న భయంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో గుట్టుచప్పుడు కాకుండా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.ఇదే తరహా బెదిరింపు కాల్స్ మున్సిపల్ కార్యాలయంలోని మరికొంతమంది సిబ్బందికి కూడా రావడంతో ఉద్యోగులు భయాందోళనలకు గురవుతున్నారు.ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. అయితే, ఏసీబీ ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు టౌన్ సీఐ మహేశ్వరుడు పేర్కొన్నారు.

## పాడి పరిశ్రమ అభివృద్ధి చేసుకోవాలి



**దేవరకొండ, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** డిండి మండల గోనకోల్ గ్రామంలో జరిగిన రైతు సదస్సులో నల్లగొండ జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, “ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిపోవడంతో రైతులు పాడి పరిశ్రమపై దృష్టి పెట్టాలి. గేదెలు, ఆవులను విరివిగా పెంచి పాల ఉత్పత్తి పెంచుకోవాలి” అని సూచించారు.పాడి పశువులకు తగిన మేత అందించడంతో పాటు ఆడ దూడల పెంపకంపై శ్రద్ధ వహించాలని, ప్రభుత్వం 75% సబ్సిడీతో గడ్డి విత్తనాలు, దానాలు అందజేస్తుందని తెలిపారు. వ్యవసాయంలో క్షీణత దృష్ట్యా పాడి పరిశ్రమ రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.విశిష్ట అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ వంగాల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, “ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున రైతులు పాడి పశువులపై శ్రద్ధ వహించి పాల ఉత్పత్తి పెంచుకోవాలి. జెర్సీ ఆవులను పెంపకం చేసి పాల కేంద్రాలను ఏర్పాటు చేయాలి” అని సూచించారు.ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ నాగయ్య రైతులకు సలహాలు ఇచ్చారు. గోనకోల్ గ్రామ రైతు లోకసాని వెంకటరెడ్డి తన అనుభవాలను పంచుకున్నారు. సర్పంచ్ కోసిరెడ్డి రాజేందర్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు, పాడి రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గడ్డి విత్తనాలు, ప్రోటీన్ బ్యాగులు ఉచితంగా పంపిణీ చేశారు.

## కల్వకుర్తి రూరల్ మండలంలో వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి



**కల్వకుర్తి, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది నియోజక వర్గాలతో పాటు కల్వకుర్తి నియోజకవర్గంలో మొదటిసారిగా కల్వకుర్తి రూరల్ మండలంలో వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు తాసిల్దార్ ఇబ్రహీం మంగళవారం మీడియాకు తెలిపారు.ఈ విజయానికి సహకరించిన కార్యాలయ సిబ్బంది, గ్రామాల బీఎల్వోలు, సూపర్వైజర్లు, బీఎలఏలు, గ్రామస్థాయి నాయకులు, జిపిఓలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. “మొట్టమొదటగా కల్వకుర్తి రూరల్ మండలంలో డిజిటలైజేషన్ పూర్తి కావడం గర్వకారణం” అని తాసిల్దార్ పేర్కొన్నారు.

## ఆటో రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి పులిజాల పరశురాములు



**కల్వకుర్తి, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం ముందు తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ ఒ మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పులిజాల పరశురాములు మాట్లాడుతూ, “ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రతి ఆటో కార్మికునికి సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇవ్వాలి. అర్హులైన ఆటో డ్రైవర్లందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి” అని డిమాండ్ చేశారు.అలాగే ఆటో డ్రైవర్లను ఈ--ఛాలన్ నుండి మినహాయించి, వాహన సారథి పోర్టల్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు కొనసాగించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంవిఐ మనోజ్ కుమార్కు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు దేశం సైదులు, కార్యదర్శి అమీర్, కోశాధికారి మహేష్, ఉపాధ్యక్షులు రాజేష్, నాగరాజు, పరశురాం గౌడ్, మర్రిపల్లి శేఖర్, నవీన్, అంజి, కొండల్, లక్ష్మణ్, ఖదీర్, సాయి, రఘు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రిని పరామర్శించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాజీ మంత్రి జక్కుల చిత్తరంజన్ దాస్ ఇటీవల అస్వస్థతకు గురై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతున్న నేపథ్యంలో మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రిని పరామర్శించిన వారిలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, ఐల్ల శ్రీనివాస్ గౌడ్, సంజీవ్ కుమార్ యాదవ్, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, రవి గౌడ్, రాహుల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## స్వర్గీయ జైపాల్ రెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర మాజీ మంత్రి, అత్యుత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత సూదిని జైపాల్ రెడ్డి దేశానికి, కల్వకుర్తి ప్రాంతానికి చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.మంగళవారం హైదరాబాద్‌లోని శక్తిస్థల్ వద్ద జైపాల్ రెడ్డికి నివాళులు అర్పించిన ఆయన, అనంతరం స్ఫూర్తి స్థల్ వద్ద జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీతా రెడ్డితో కూడా ఆయన భేటీ అయ్యారు.తరువాత కల్వకుర్తి పట్టణంలోని కొట్రా చౌరస్తా వద్ద జైపాల్ రెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, “జైపాల్ రెడ్డి తెలంగాణ ఆవిర్భావానికి కీలక పాత్ర పోషించారు. ఆయన చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తి” అని గుర్తుచేశారు.తరువాత ఫంక్షన్ హాల్‌లో సర్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమనగల్ మండలం ఎక్కువయిపల్లి గ్రామపంచాయతీలో ఎల్లమ్మ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారం తిరిగివ్వని ఓటర్లు - హైదరాబాద్‌లో భారీగా ఓట్ల రద్దు!

**హైదరాబాద్:** రాజధాని హైదరాబాద్‌లో ఓటర్ల సంఖ్య భారీగా తగ్గబోతోందంటే మీరు నమ్ముతారా? కానీ ఇప్పుడు జరిగే వాస్తవం మాత్రం ఇదే. హైదరాబాద్?లో నకిలీ ఓట్లు భారీగా ఉన్నాయి. అదే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు కూడా గతంలో ఇక్కడ ఓటు నమోదు చేసుకున్నారు. దీంతో వారికి సొంత రాష్ట్రంలో సైతం ఓటు ఉంది. ఇలాంటి సమస్యలకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియ చెక్? పెట్టేస్తుంది. రెండు రాష్ట్రాల్లో ఓటు ఉంటే 2 ఎన్యూమరేషన్ ఫారాలు ఇస్తున్నారు. కానీ ఓటర్లు తమకు నచ్చిన ఏదైనా ఒక దానిని మాత్రమే ఎంచుకోవాలి.
లేదంటే రెండేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామని ఎన్నికల అధికారులు ముందు నుంచీ చెబుతూనే ఉన్నారు. అవసరమైతే రెండు చోట్ల ఓటు రద్దు కూడా అవుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ లెక్కన అప్రమత్తమైన ఓటర్లు తమ సొంత రాష్ట్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీని ప్రకారం హైదరాబాద్?లో మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల ప్రజలు



ఎన్యూమరేషన్? ఫారాలు తీసుకుని వెనక్కి ఇవ్వడం లేదు. ఈ కారణంతో గరిష్ఠంగా హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల్లో భారీగా ఓట్లు రద్దు కేటగిరీలో చేరనున్నాయి. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది.పత్రాలు తిరిగివ్వడం లేదు : ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకున్న వారు చాలా మంది వాటిని తిరిగి బీఎల్వోలకు ఇవ్వట్లేదు. ఆగస్టు 3 వరకు గడువుందని చాలా మంది ఇంకా నిర్లక్ష్యంగా ఉంటున్నారు. అయితే చివరి తేదీన సర్వర్ సమస్యలు తలెత్తుతాయనే ఉద్దేశంతో ఉద్యోగులు ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌లో వేగం పెంచారు. ఎన్యూమరేషన్ పత్రాలను ఇవ్వని వారి ఓట్లు కూడా ఏఎస్‌డీ జాబితాలోకి వెళ్తున్నాయనే ఆందోళన ప్రస్తుతం వ్యక్తమవుతోంది. అంబర్‌పేటలో అత్యల్పం : హైదరాబాద్ జిల్లా పరిధిలోని అంబర్‌పేటలో ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలీకరణ ఇప్పటికే 50 శాతం పూర్తి అయింది. అయితే రద్దు కేటగిరీ ఓట్లు అంబర్‌పేటలో 3 శాతం, కంటోన్మెంట్‌లో 20 శాతంగా ఉండటం గమనార్హం.బీఎల్వోల నిర్లక్ష్యమూ : ఓటరు జాబితా సవరణలో పలు నియోజకవర్గాల్లో అధికారులూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ స్వీకరణ, డిజిటలీకరణలో సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదు. దీంతో ఇప్పటి వరకు క్యూర్? పరిధిలోని నియోజకవర్గాల్లో 20 శాతం ఓట్లు ఏఎస్‌డీలోకి వెళ్లాయని, మరో వారం రోజుల్లో 40 శాతానికి మించుతుందని స్థానిక యంత్రాంగం అంచనా వేస్తోంది.ఏఎస్‌డీ జాబితాలోకి : ఎన్యూమరేషన్ పత్రాలను తిరిగివ్వని వారితో పాటు ఇల్లు మారిన, మృతి చెందిన (ఏఎస్‌డీ), నియోజకవర్గం మారిన, ఓటర్ల వివరాలను జాబితా నుంచి తీసేస్తారు. అందులో ఎలాంటి సందేహం లేదని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్?ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణణ్ జీహెచ్ఎంసీ స్పష్టం చేస్తోంది.హైదరాబాద్ జిల్లాలోఏదైనా అధికారిక ధ్రువీకరణ పత్రం ద్వారా ఓటు హక్కును ఇక్కడే ఉంచుకునే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. వివరాలను నింపలేక ఎన్యూమరేషన్ ఫారాన్ని ఇంట్లోనే ఉంచుకుంటే మాత్రం ఓటు కచ్చితంగా రద్దవుతుందనే విషయాన్ని అధికారులు పదే పదే గుర్తుచేస్తున్నారు. ఓటరు నమోదు పత్రాలు నింపేందుకు జీహెచ్?ఎంసీ కేంద్ర కార్యాలయంతో పాటు సర్కిల్ ఆఫీసుల్లో హెల్ప్?లైన్? సెంటర్లు విస్తృతంగా పని చేస్తున్నాయి.

# నేనెక్కడికి పారిపోలేదు.. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి క్లారిటీ



**హైదరాబాద్:** రాజేంద్రనగర్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపుల కేసు సంచలనంగా మారిన విషయం తెలిసిందే. మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ఉదయ్ కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. 2 రోజులుగా ఉదయ్ కృష్ణారెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుండగా.. హైదరాబాద్‌లోని రెండు అడ్రస్‌ల్లోనూ ఉదయ్ కృష్ణారెడ్డి కనిపించడం లేదని వార్తలు వచ్చాయి. పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డి స్టేట్‌మెంట్ రికార్డ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పరారిలో ఉన్నాడని, ఫోన్ కూడా స్విచాఫ్ వస్తుందన్న వార్తల నేపథ్య ంలో ఉదయ్ కృష్ణారెడ్డి స్పందించాడుతాను ఎక్కడికీ పారిపోలేదని క్లారిటీ ఇచ్చాడు ఉదయ్ కృష్ణారెడ్డి . మా నానమ్మ అనారోగ్యంతో ఉన్నందుకు సొంతూరు ఊళ్లపాలెం వచ్చాను. న్యాయ, పోలీసు వ్యవస్థల మీద నమ్మకంతోనే విచారణకు హాజరవుతున్నా. నా నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటా. నా శాశ్వత చిరునామా ఊళ్లపాలెంకు ఎటువంటి నోటీసులు రాలేదని స్పష్టం చేశాడు. ఈ వ్యవ హారం కోర్టు పరిధిలో ఉంది కాబట్టి ఎక్కువ మాట్లాడలేనని పేర్కొన్నాడు ఉదయ్ కృష్ణారెడ్డి.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల ప్రవేశాలు ప్రారంభం



**హనుమకొండ చౌరస్తా, జూలై 28:** డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026--27 విద్యా సంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల ప్రవేశాలు ప్రారంభమైనట్లు వరంగల్ ప్రాంతీయ సంచాలకులు ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్మీడియట్, 10o2 అర్హత కలిగిన విద్యార్థులతో పాటు రెండేళ్ల పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు.డిగ్రీ ప్రవేశాల కోసం ఆధార్ కార్డు, ఫొజ, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం (అవసరమైన వారికి), పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో సమీప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రవేశాలకు ఆగస్టు 7 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ప్రవేశ నమోదు పూర్తి చేసి, తాము ఎంపిక చేసుకున్న అధ్యయన కేంద్రంలో సంబంధిత ధ్రువపత్రాల ను సమర్పించాలని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-0101, ఫోన్ నంబర్లు 040-23680333, 040-23680444, 040-23680555లను సంప్రదించాలని జ్యోతి కోరారు.

# ఆ విషయంలో రేవంత్ రెడ్డి, కేటీఆర్‌కు అవార్డులు ఇవ్వాలి:

**హైదరాబాద్:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీ పర్యటనపై ఎంపీ ధర్మపురి అరవింద్ స్పందించారు.(మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణను దోచుకున్న ఇద్దరూ ఢిల్లీలో ఉన్నారంటూ వ్యాఖ్యానించారు. కేటీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయడంలో విజయవంతమయ్యారని విమర్శి ంచారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడంలో విఫలమవడం వల్ల, తెలంగాణలో ప్రతి సంవత్సరం దాదాపు 20 లక్షల మంది విద్యార్థులు తమ విద్యా భవిష్యత్తుపై అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరుగుతున్న ఆర్థిక భారం కారణంగా వందలాది కళాశాలలు కూడా మూసివేతకి సిద్ధంగా ఉన్నాయని ఎంపీ అన్నారు. కాంగ్రెస్‌కు



ముందు, బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. అవినీతిలో కూరుకుపోయిన కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి రుణభార ప్రాజెక్టులలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని కుమ్మరించిందని వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా కే-కుటుంబం అపారమైన సంపదను కూడబెట్టిందని ఆరోపించారు. ఇప్పుడు జెన్ జెడ్‌కు మద్దతుగా రేవంత్ రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ మొసలి కన్నీళ్లు కార్చుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశంలో అత్యధిక నిరుద్యోగ రేటు ఉన్న రెండు రాష్ట్రాలలో తెలంగాణ ఒకటని ఎంపీ అన్నారు. దాదాపు 13 ఏళ్లుగా ఉద్యోగాల క్యాలెండర్‌ను నిలిపివేసినందుకు రేవంత్ రెడ్డి, కేటీఆర్‌కు అవార్డులు ఇవ్వాలంటూ సెటైర్ విసిరారు. తెలంగాణకు ఇప్పుడు ఆర్థిక క్రమశిక్షణ, స్వచ్ఛమైన పాలన ఉన్న ప్రభుత్వం కావాలన్నారు. అందుకే తెలంగాణ.. బీజేపీకి సిద్ధంగా ఉందని గట్టిగా నమ్ముతున్నట్లు ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు.

# నిండుకుండలా జూరాల ప్రాజెక్టు - ఎగువ నుంచి నీటి విడుదలతో జలకళ

**గద్వాల :** జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజె క్టుల నుంచి నీటిని విడుదల చేయడంతో జూరా లలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. కృష్ణానదిపైనే ఈ ప్రాజెక్టును నిర్మించారు. జూరాల ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.989 టీఎంసీలకు చేరింది. ఎగువ ప్రాజెక్టుల నుంచి జూరాల జలాశయానికి 29,668 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోందని అధికారులు తెలిపారు. 27,210 వేల క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ రిజర్వాయర్లకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీఆర్?ఎస్? మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కర్ణాటకలోని గూడూరు ప్రాంతాన్ని సందర్శించిన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలను రాష్ట్ర క్రీడలు, పశుసంవర్ధక శాఖల మంత్రి వాకిటి శ్రీహరి



సోమవారం ఒక ప్రకటన విడదల చేసి ఖండించారు. కృష్ణా నది జలాలపై మాట్లాడే హక్కు బీఆర్?ఎస్? పార్టీకీ లేదని పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి హయాంలో కర్ణాటకలో డ్యాంలు కట్టినప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని మంత్రి నిలదీశారు.బీఆర్?ఎస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోని రైతుల ప్రయోజనాలను గత బీఆర్?ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మంత్రి వాకిటి శ్రీహరి మండిపడ్డారు. భీమా, కృష్ణా నదుల నీటిని నిల్వ చేసి సాగు, తాగునీరు అందించాలనే ఆలోచన కూడా చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్న ఆయన పొరుగు రాష్ట్రమైన కర్ణాటక ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ కృష్ణా, భీమా నదులపై బ్యారేజీ-కమ్-బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు వివరాలు సిద్ధం చేశామన్నారు. జూరాల ప్రాజెక్టు ముంపు గ్రామాలైన భూత్పూర్, అంకెనపల్లి, దాదంపల్లి, నేడుగం, అనుగొండ ప్రజల సమస్యలను దశాబ్దకాలంగా పట్టించుకోలేదని ఫైర్ అయ్యారు. ప్రస్తుతం ఆ గ్రామాల అభివృద్ధి, పునరావాసం, భూత్పూర్ డ్యాం విస్తరణ వంటి అంశాలపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. పాలమూరు జిల్లా ప్రజల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే, ప్లకార్డులు పట్టుకుని రాజకీయ డ్రామాలు చేయడం చేస్తే వారిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వాకిటి పేర్కొన్నారు.సాగర్? ఆయకట్టు రైతుల్లో ఆందో ళన : మరోవైపు నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులు జలాశయం వైపు ఆశగా ఎదురు చూ స్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం మొత్తం నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 513.10 అడుగులుగా ఉంది. ఇది డెడ్ స్టోరేజ్‌కు దగ్గరలో ఉందని అధికారులు చెబుతున్నారు. సాగర్ జలాశయం మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 136 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రాజెక్టు ఎగువ నుంచి 900 క్యూసెక్కుల నీరు ఇన్?ఫ్లోగా వస్తుంది. హైదరాబాద్ తాగు నీటి కోసం 900 క్యూసెక్కుల నీటిని ఔట్?ఫ్లోగా విడుదల చేస్తున్నారు. ఎల్?నినో ప్రభావంతో సాగర్ ఆయకట్టు రైతులు పంటలకు సాగు నీరు వస్తుందా రాదా? అనే ఆందోళనలో ఉన్నారు. గత ఏడాది జులై మాసం చివరి నాటికి వర్షాలు అధికంగా కురవడంతో నాగార్జునసాగర్ ఎడమ కాలువకు సాగు నీటిని విడుదల చేశారని గుర్తు చేసుకుంటున్నారు.

# దూరు నుంచి జహీరాబాద్‌కు కొత్త రైల్వే లైన్

**జహీరాబాద్:** తాండూరు సిమెంట్ క్లస్టర్-జహీరాబాద్ మధ్య కొత్త రైల్వే లైన్ కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారు. తాజాగా దీని ఏర్పాటుకు కీలక ముందడుగు పడనుంది. ఈ రైల్వే లైన్‌కు సంబంధించిన క్షేత్రస్థాయి సర్వే ఇప్పటికే పూర్తయ్యింది. ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో సమగ్ర సర్వే చేపట్టారు. సర్వే నివేదిక ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే అధికారుల పరిశీలనలో ఉంది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభం కానున్నాయి. ఈ కొత్తలైన్‌తో జహీరాబాద్ వాణిజ్య ముఖచిత్రం కూడా మారనుంది.గేట్ రహిత ప్రయాణం : ఈ రైలు మార్గం అంచనా వ్యయం రూ. 1,350 కోట్ల నుంచి రూ. 1,400 కోట్లుగా సర్వేలో తేల్చారు. ఈ రైల్వే లైన్‌ను సుమారు 70 నుంచి 75 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు లేకుండా భవిష్యత్తులో ఈ మార్గం గుండా రైల్వే క్రాసింగ్ గేట్లు లేకుండా డిజైన్ చేశారు. వాహనాల రాకపోకలు కేవలం అండర్ బ్రిడ్జిలు, ఆర్వోబీల ద్వారానే సాఫీగా సాగేలా ప్రణాళికలు రూపొందించారు.స్టేషన్లు రానున్న ప్రాంతాలివే : ఈ కొత్త లైన్ ద్వారా పలు గ్రామాల్లో రైల్వే స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. ఎందుకంటే ఇది జహీరాబాద్, తాండూరు ప్రాంతాలను నేరుగా కలపనుంది.



జహీరాబాద్, కోహీర్ మండలాల పరిధిలో శేఖాపూర్, మల్‌చెల్మ, గొడిగార్‌పల్లి, బడంపేటలో స్టేషన్ రానుంది. అలాగే వికారాబాద్ జిల్లాలో బంట్వారం, పెద్దేముల్, ఇందూరు, తట్టేపల్లి, కరణ్‌కోట, మల్కాపూర్, చల్కటూర్?లో రానుంది. అలాగే కర్ణాటకలోని కుంచవరం ప్రాంతాలను సైతం ఈ రైల్వేలైన్‌కు అనుసంధానం చేయనున్నారు.సరుకు రవాణాకు ఊతంగా : జహీరాబాద్ నుంచి తాండూరుకు రైలులో వెళ్లాలంటే ఇప్పుడు వికారాబాద్? మీదుగా వెళ్తున్నారు. దాదాపు 104 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. అంటే సుమారు 3 గంటల సమయం పడుతోంది. ఈ కొత్త లైన్? రాకతో ప్రయాణ సమయం ఏకంగా గంటన్నర దాకా ఆదా కానుంది. ఒకవేళ రోడ్డు మార్గంలో వెళ్లాలంటే రెండు రాష్ట్రాలు, రెండు జిల్లాల సరిహద్దులు దాటుతూ వెళ్తున్నారు. ఈ రైల్వే లైన్‌తో ఆ ఇబ్బందులు కూడా తొలగిపోనున్నాయి.

# సాగర్ నీటితో చెరువులు నింపాలి



**అనంతగిరి, జూలై 28 :** సాగర్ నీరు ఖమ్మం జిల్లాకు తరలిపోతున్నా జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చోద్యం చూస్తున్నారని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. మంగళవారం అనంతగిరి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు ధ్యేయంగా స్వరాష్ట్ర సాధన జరిగిందని, సొంత రాష్ట్రంలో కూడా జిల్లాకు మొండి చేయి చూపి పాలేరుకు జలాలు తరలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తమ్ దంపతులకు రైతుల గోస కనిపించడం లేదన్నారు. గతంలో కూడా జిల్లాలోని కాల్వ తూములను సీజ్ చేసి ఖమ్మం జిల్లాలకు నీటిని తరలించుకుపోయారని, తర్వాత వరద నీటితో తూముల్లో నీరు పారక కాల్వలకు గండ్లు, చెరువులు తెగిపోయి గ్రామాలు ముంపునకు గురైన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

# మా దగ్గర తీసుకున్న కమీషన్ ఇచ్చేయండి

**హైదరాబాద్:** ఒకే పనికి రెండుసార్లు బిల్లులు చెల్లించిన అధి కారులకు ఇప్పుడు కాంట్రాక్టర్లు ఝలక్ ఇస్తున్నారు. అవినీతి జరిగినట్లు ఆలస్యంగా వెలుగులోకి రావడంతో అడ్డదారిలో వెళ్లిన ప్రజా ధనాన్ని రికవరీ చేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించింది. అయితే రెండో బిల్లులో తీసుకున్న 10 శాతం కమీషన్ డబ్బును అధికారులూ తిరిగివ్వాలని కాంట్రా క్టర్లు పట్టుబడుతున్నారు. అలాగే జీహెచ్ఎంసీ అడుగుతున్న వడ్డీ డబ్బును చెల్లించలేమని




చెబుతున్నారు.బల్దియా చరిత్రలో మొదటిసారి : కమీషన్, వడ్డీ డబ్బుతో కాంట్రాక్టర్లు రికవరీ ప్రక్రియపై మెలిక పెట్టడంతో శాఖాపరమైన చర్యల పేరుతో ఫైనాన్స్ విభాగం 78 మంది లైసెన్సులను హోల్డ్?లో పెట్టింది. ఆయా కాంట్రాక్టర్లకు ఇకపై జీహెచ్ఎంసీ ద్వారా బిల్లుల చెల్లింపు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంది. జీహెచ్?ఎంసీ చరిత్రలో ఇంత మంది కాంట్రాక్టర్లపై ఒకేసారి చర్యలు తీసుకోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.కమిషనర్ లేఖలతో : అనారోగ్యం, తమ పిల్లల వివాహం, ఇతరత్రా అత్యవసర కారణాలు చూపుతూ తమకు వెంటనే బిల్లులు చెల్లించాలని అభ్యర్థిస్తూ కొందరు గుత్తేదారులు జీహెచ్?ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్??కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. దీంతో కొన్నింటిని కమిషనర్ పరిగణనలోకి తీసుకున్నారు. దీంతో ఆయా గుత్తేదారులకే రెండుసార్లు వర్క్? బిల్లుల చెల్లింపు జరిగింది. దీనికి కారణం కంప్యూటర్ ఆపరేటర్ చేతివాటమేనని తెలుస్తోంది.ఏళ్లకు ఏళ్లుగా ఫైనాన్స్ విభాగంలో పని చేస్తోన్న పొరుగు సేవల సిబ్బంది కమిషనర్ సిఫార్సును సొమ్ము చేసుకున్నాడు. కమిషనర్ సిఫార్సు లేఖ ఆయా కాంట్రాక్టర్ల బిల్లులను వరుస క్రమంలోనూ కొనసాగించారు.